
మరిన్ని కథనాల
కోసం
యూట్యూబ్‌లో
ప్రసారమవుతున్న
మీ
SREECHAKRA
NewsTVని
వీక్షించవచ్చు.
ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్,

https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY




సంపుటి 11 | సంచిక 14 | కర్నూలు | గురువారం ఫిబ్రవరి 19 2026 | పేజీలు : 08 | వెల రూ. 5.00


Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

## ఏపీ అభివృద్ధికి కీలక అడుగు.. భారీ పెట్టుబడులకు ఆమోదం



అమరావతి, ఫిబ్రవరి 18(శ్రీచక్ర) : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునా యుడు నేతృత్వంలో ఉండవల్లి క్యాపు కార్యాలయంలో 15వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎం చర్చించారు. ప్రధానంగా వివిధ రంగాలకు చెందిన కంపెనీల పెట్టుబడులపై మాట్లాడారు. మొత్తం రూ.37, 899 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ పెట్టుబడుల ద్వారా 56,692 మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఐటీ, విద్యుత్, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాలు, పరిశ్రమల రంగాలకు చెందిన వివిధ పెట్టుబడి ప్రతిపాదనలకు ఎస్ఐపీబీలో ఆమోదం తెలిపారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, పి.నారాయణ, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్ రెడ్డి, వాసంశెట్టి సుభాశ్, సీఎస్ కె.విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు

## అంబటి రాంబాబుకు బెయిల్.. రాజమండ్రి జైలు నుంచి విడుదల..



అమరావతి, ఫిబ్రవరి 18(శ్రీచక్ర) : సంక్రాంతి లక్కీ డ్రా కేసులో వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఊరట లభించింది. గుంటూరు కోర్టు బుధవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలోనే రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి అంబటి విడుదల అయ్యారు. 2023 సంవత్సరంలో సంక్రాంతి పండుగ సమయంలో మంత్రి అంబటి రాంబాబు నేతృత్వంలో సంక్రాంతి లక్కీ డ్రా పేరుతో సత్తెనపల్లిలో వైఎస్సార్ సీపీ నేతలు టికెట్లు అమ్ముకుంటున్నారని జనసేన నేతలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవటంతో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు రాంబాబుపై వెంటనే కేసు నమోదు చేసి, విచారణ జరపాలని పోలీసులను ఆదేశించింది.దీంతో ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్కులేషన్ స్కీమ్స్ నిషేధ చట్టం కింద పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఇదే కేసుకు సంబంధించి తాజాగా పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. గత కొద్దిరోజుల నుంచి అంబటి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటున్నారు. ఆయన బెయిల్ పిటిషన్‌పై ఈ రోజు గుంటూరు కోర్టు విచారణ జరిపింది. పోలీసుల కస్టడీ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.అంబటికిబెయిల్ మంజూరు చేసింది.

## హెరిటేజ్ సంస్థ ఇందాపూర్‌తో చీకటి ఒప్పందం : బొత్స సత్యనారాయణ



అమరావతి : తిరుమలకు నెయ్యి సరఫరా చేసిన ఇందాపూర్‌తో హెరిటేజ్ సంస్థ చీకటి ఒప్పందం చేసుకుందని వైసీపీ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం ఏపీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం దోచుకోవడమే లక్ష్యంగా పాలన కొనసాగుతుందని విమర్శించారు.రూ. 320కి కొనుగోలు చేసే నెయ్యి రూ.700 కు పెంచడం వెనుక కారణం తెలియాలని అన్నారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ ఈసెం పవన్ కల్యాణ్‌కు చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని డిమాండ్ చేశారు . అసెంబ్లీలో చర్చకు రావాలని కోరితే ప్రభుత్వం వెనుకంజ వేస్తుందని దుయ్యబట్టారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ నిరాశజనకంగా ఉందని ఆరోపించారు.రైతుల గిట్టుబాటు ధరల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని , నిరుద్యోగులు భృతి కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. మంత్రి లోకేష్ అసెంబ్లీలో మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని విమర్శించారు.

# విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ



విశాఖపట్నం,ఫిబ్రవరి18(శ్రీచక్ర) : దేశ తీర ప్రాంత ప్రయోజనాలు కాపాడటంలో నేవీది కీలకపాత్ర అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. సముద్ర వాణిజ్యంలో సైతం నేవీ సుస్థిరత తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విశాఖపట్నం తీరం వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) బుధవారం ప్రారంభమయ్యాయి. బుధవారం ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ముతోపాటు ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొని.. ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధనా నౌకలు 9 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నారు. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. విశాఖ తీరంలో



### ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించిన రాష్ట్రపతి ముర్ముతో పాటు పాల్గొన్న గవర్నర్, సిఎం, డిప్యూటి సిఎం



ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కొనసాగుతోంది. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేరుగా వీక్షించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐఎన్ఎస్ సుమేధ నౌకపై రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం ప్రయాణించారు. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ.. తదితర దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు 7 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నాయి.

# టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం: హోంమంత్రి అనిత

అమరావతి, ఫిబ్రవరి 18(శ్రీచక్ర) : టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై అసెంబ్లీలో తాము చర్చకు సిద్ధమని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ప్రజాహితం గురించి ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధమని, ఆధారాలతో రావాలని వైసీపీ సభ్యులకు సవాల్ విసిరారు. టీటీడీ కల్తీ నెయ్యి విషయంపై చర్చకు సిద్ధమని సభలోనే మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో అనిత మాట్లాడారు. టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ తమ ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్టులో అసలు అది నెయ్యి కాదని.. రసాయనాల మిశ్రమమని చెప్పిందని తెలిపారు. గతంలో కూడా పింక్ డైమండ్ గురించి వైసీపీ సభ్యులు సభ సమయాన్ని వృథా చేశారని విమర్శించారు. అధికారుల విచారణలో పింక్ డైమండ్ అనేది లేదని తేలిందన్నారు. హెరిటేజ్ 34 సంవత్సరాలుగా ఉన్న సంస్థ అని.. హెరిటేజ్ నుంచి దేవాలయాలకు నెయ్యి పంపిణీ చేయకూడదనే నిబంధన పెట్టుకున్నారని చెప్పుకొచ్చారు.

సభలో రాద్ధాంతం చేస్తే కుదరదు..: వైసీపీ సభ్యులు సంబంధం లేని విషయాలని సభకు తీసుకువచ్చి రాద్ధాంతం చేస్తే కుదరదని... ఆధారాలు ఉంటే రండి చర్చకు సిద్ధమని హోంమంత్రి అనిత సవాల్ విసిరారు. వైసీపీ నేతలకు దేవుడంటే లెక్క లేదని మండిపడ్డారు. టీటీడీ నెయ్యికి సంబంధించి సేకరణ లేని సంస్థకు జగన్ హయాంలో కాంట్రాక్ట్ ఇచ్చారని, ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని ఛాలెంజ్ చేశారు. ఎవరితోనైనా ఆడుకోండని.. కానీ వేంకటేశ్వరస్వామితో ఆటలాడొద్దని హెచ్చరించారు. సాక్షి పేపర్‌లో రాసిన విషయాలని వైసీపీ సభ్యులు సభలో మాట్లాడుతున్నారని హోంమంత్రి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారు..: సాక్షి పేపర్‌లో యాడ్‌ల కోసం రూ.600 కోట్ల ప్రభుత్వ ధనాన్నిదుర్వినియోగం




చేశారని హోంమంత్రి అనిత ఆరోపించారు. వైసీపీ నేతల్లాగా తమకు దుర్బుద్ధి లేదని చెప్పుకొచ్చారు. వైసీపీ సభ్యులే కల్తీ లడ్డూ మీద వాయిదా తీర్మానం, ఇందాపూర్ డెయిరీ పైన వాయిదా తీర్మానం ఇచ్చారని ప్రస్తావించారు. మదనపల్లి చిన్నారి ఘటన విషయంలో నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అతను చేసింది తప్పని.. అందుకే ఆత్మహత్య చేసుకున్నాడని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

## మంత్రి నారా లోకేశ్‌పై ఉండవల్లి అరుణ్ కుమార్ ప్రశంసలు..

రాజమండ్రి, ఫిబ్రవరి 18 : ఏపీ మంత్రి నారా లోకేశ్‌పై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ప్రశంసలు కురిపించారు. కర్నూలు కోవాబన్ వలీకి మంత్రి నారా లోకేశ్ అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. బీజేపీ అలయన్స్‌లో ఉండి ముస్లింకి లోకేశ్ అండగా నిలవడంపై అభినందించాలని పేర్కొన్నారు. రాజమండ్రిలో ఇవాళ(బుధవారం) మీడియాతో ఉండవల్లి మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి రావాల్సిన రూ.80 వేల కోట్ల కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని సూచించారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచినా కూడా విభజన హామీలు ఇంకా అమలు కాలేదని పేర్కొన్నారు.

తిరుపతి లడ్డూ అంశాన్ని రాజకీయం చేయొద్దు.. విభజన వల్ల ఏపీకి జరిగిన అన్యాయంపై పోరాడటానికి సుప్రీంకోర్టులో ఓ అడ్వొకేట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఉండవల్లి అరుణ్ కుమార్ కోరారు. తిరుపతి లడ్డూ అంశాన్ని రాజకీయం చేయటం మంచిది కాదన్నారు. లడ్డూ కల్తీ చేసిన వారిపై సిట్ నివేదిక ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఉన్న హెరిటేజ్, భారతి సిమెంట్స్ ప్రధాన కార్యాలయాలను అమరావతికి తీసుకురావాలని సూచించారు. వైసీపీ తరహాలోనే కూటమి ప్రభుత్వం కూడా కక్ష సాధింపు చర్యలకు వెళ్లకూడదని హితవు పలికారు. చంద్రబాబును జైల్లో పెట్టడం వల్ల జగన్‌కు నష్టమే జరిగిందని.. కూడా నష్టమే జరుగుతుందని చెప్పుకొచ్చారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలను ఇబ్బందులకు గురి చేయటాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఉండవల్లి అరుణ్ కుమార్ పేర్కొన్నారు.




## ఎన్ని రోజులు జైల్లో పెట్టిన వెనక్కు తగ్గను: అంబటి రాంబాబు



రాజమండ్రి, ఫిబ్రవరి 18(శ్రీచక్ర) : సంక్రాంతి లక్కీ డ్రా కేసులో వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఊరట లభించింది. గుంటూరు కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలోనే రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి అంబటి విడుదల అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 18 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో తాను ఉన్నానని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కక్షగట్టి తనను జైల్లో పెట్టారని ఆరోపించారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని.. వెనుకడుగు వేయనని స్పష్టం చేశారు.తన ఇంటిపై ఏడు గంటలు దాడి జరిగిందని అంబటి రాంబాబు ప్రస్తావించారు. పోలీసులు ఉండగానే తన ఇంటిపై దాడి జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలపై ప్రజలకు అన్ని విషయాలు చెబుతానని అన్నారు. తనపై దాడిని చంద్రబాబు, లోకేష్ మానిటరింగ్ చేశారని ఆరోపించారు. హోంమంత్రి వంగలపూడి ఎన్ని రోజులు జైల్లో పెట్టినా వెనక్కు తగ్గనని, ప్రజాస్వామ్యబద్ధంగా చంద్రబాబు ప్రభుత్వాన్ని కూలగొట్టేవరకు పోరాడతానని స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## గ్రామ, పట్టణాల అభివృద్ధి లక్ష్యం కావాలి !

గ్రామాలు, పట్టణాల ఎన్నికలు పూర్తిక ఆవడంతో ఇక అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సాగించే బాధ్యత సిఎం రేవంత్‌పై ఉంది. ఎన్నికల్లో ఎన్ని రాజకీయాలు చేసినా, అభివృద్ధి విషయంలో సమన్వయంతో అందరినీ కలుపుకుని పోవాల్సి ఉంటుంది. రానున్నది వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాల్సి ఉంది. మంచినీరు, పారిశుద్యం లాంటి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామస్థాయిలో అవినీతి విపరీతంగా ఉంది. పంచాయితీ వ్యవహారాలను, మున్సిపల్ వ్యవహారాలను పారదర్శకంగా సాగించాలి. పూర్తిస్థాయి కంప్యూటీకరణతో పనులను వేగంగా జరిగేలా చూడాలి. ఎందుకంటే అవినీతిరహిత, పారదర్శక పాలన అన్నది గ్రామాల నుంచే ప్రారంభం కావాలి. మున్సిపాలిటీల్లో కూడా పారదర్శక విధానాలకు పెద్దపీట వేయాలి. మంచినీరు, పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిధుల విడుదలలో కూడా రాజకీయాలు లేకుండా చూడాలి. గ్రామాభివృద్ధిలో సర్పంచ్ ల పాత్ర అత్యంత కీలకం. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు, మున్సిపల్ ఛైర్మన్లకు పాలనా పరమైన అవగాహన కల్పించాలి. ఇప్పటికే పంచాయతీల సర్పంచ్‌లకు విడతల వారీగా శిక్షణ అందిస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్లకు, వైఎస్ ఛైర్మన్లకు కూడా శిక్షణ అందించాలని సిఎం నిర్ణయించారు. అందువల్ల పాలనా పరంగా ప్రజలకు సేవ చేసేలా శిక్షణ ఇవ్వాలి. చేయిచాపే విధానాలకు స్వస్తిపలకాలి. ఈ విషయంలో వారికి కఠినమైన ఆదేశాలు ఇవ్వాలి. పంచాయతీరాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సవివరంగా మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్పంచ్‌లు గ్రామంలో జరుగుతున్న ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఇకపోతే కొత్తగా కొలువుదీరిన మున్సిపల్ పాలకవర్గాలకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇచ్చిన హామీలను నెరవేర్చడం సవాల్‌గా మారనుంది. పట్టణాల్లో ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీలు కంపుకొడుతున్నాయి. అనేక వార్డుల్లో తాగునీటి సమస్యల నెలకొన్నది. విలీన గ్రామాలు, శివారు పల్లెల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. మున్సిపాలిటీల్లో పాలన గాడి తప్పింది. మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. మరోపక్క పట్టణాలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపడుతున్నా, పట్టణ ప్రణాళికశాఖ అడ్డుకోలేకపోతున్నది. పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా, పనులు ప్రారంభంకాక పోవటంతో అభివృద్ధికి నోచుకోవడంలేదు. మరోపక్క పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టడం లేదు. ఇన్ని సమస్యలు, సవాళ్ల మధ్య కొత్త పాలకవర్గం బోధన్ మున్సిపాలిటీలో పాలనా పగ్గాలు చేపట్టింది. వీధి కుక్కల బెడద గ్రామాలు మొదలు, పట్టణ్నాల వరకు ఉంది. కోతుల సమస్య అత్యంత దారుణంగా ఉంది. వీటి నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకుంటే ఇదో పెద్ద సమస్యలగా పరిణమించడం ఖాయం. దోమలు విజృంభిస్తున్నాయి. దీనికితోడు అంటువ్యాధుల బెడద ఉంది. మిషన్ భగీరథ పేరుతో ఊదరగొట్టినా పాత మంచినీటి పథకాలకే కొత్తగా పేరు పెట్టారు. ఎక్కడా సక్రమంగా మంచినీటి వ్యవస్థ లేకుండా పోయింది. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పలు పట్టణాల్లో కొత్తగా వెలసిన శివారు కాలనీలకు తాగునీరు అందడంలేదు. తరచుగా తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోతున్నాయి. తాగునీటి లీకేజీలను అరికట్టడం మున్సిపాలిటీలకి సమస్యగా మారింది. ఈ దశలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 'అమృత్ 2.0' పథకం కింద పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఈ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. వచ్చే వేసవినాటికి తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు పూర్తిచేయాల్సిన బాధ్యత కొత్త పాలకవర్గంపై ఉంది. పెద్ద గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చారు. పలు శివారు గ్రామాలను కలిపేసారు. మున్సిపాలిటీలో పదేండ్ల క్రితం చుట్టుపక్కల ఉన్న గ్రామాలు విలీనమయ్యాయి. అక్కడి ప్రజలపై పన్నుల భారం పెరిగిందే తప్ప, అందుకు తగిన అభివృద్ధి పనులు చేపట్టడంలేదు. ముఖ్యంగా పట్టణ శివారుల్లోని కాలనీలు కనీసం రోడ్లు, డ్రైనేజీలకు నోచుకోవడం లేదు. శ్మశాన వాటికల సమస్య తీవ్రంగా ఉంది. పట్టణాల్లో కొన్నిచోట్ల దాతల సహకారంతో పునర్నిర్మించినా వందలవేల సంఖ్యలో శ్మశాన వాటికలు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇకపోతే ఇంటింటికీ చెత్త సేకరణ రోజు విడిచి రోజు జరుగు తున్నప్పటికీ, ఈ సేకరణ సక్రమంగా జరగడంలేదు. పారిశుధ్య కార్మికుల కొరత, సరిపడా చెత్త వాహనాలు లేకపోవడం ఇందుకు కారణం. పెద్ద రోడ్లను శుభ్రపరిచే స్వీపింగ్ మెషిన్లను రంగంలోకి దింపాల్సి ఉంది. ఓపెన్ డ్రెయినేజీల కారణంగా అనేక పట్టణాల్లోని వార్డుల్లో దుర్గంధం వ్యాపిస్తున్నది. నీటి సరఫరా వ్యవస్థ సక్రమంగా లేదు. మిషన్ భగీరథ పైప్‌లైన్లు సరైన నిర్వహణలేక తరచూ లీకేజీలు అవుతున్నాయి. వార్డుల్లో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకునే నాథుడేలేదు. ఉంది. ఫాగింగ్ జాడనే లేదు. ఈ సమస్యలన్నీ ఇప్పటికిప్పుడు వచ్చినవి కావు. ఏళుగా రాజ్యమేలుతున్నాయి. సరైన పద్దతిలో పరిష్కారం చేయలేదు.

# నిజాయితీ, నిజాయితీకి ప్రధానోపాధ్యాయులు సస్పెన్షన్

**సస్పెన్స్ ఎత్తివేయాలని రాష్ట్రపతి, ప్రధాని ఉత్తర్వులు సైతం బేఖాతర్**
**ఆయనకు పోస్టింగ్ ఇస్తే విద్యాశాఖ అధికారులు జైలుకే**



కర్నూలు, ఫిబ్రవరి 18 (శ్రీచక్ర): సస్పెన్షన్ కు అమ్మఒడి ప్రూఫ్స్ ఎవిడెన్స్‌ఉత్తర్వులు లేవు అయినా ఇంక్రి మెంట్ లు కట్ చేస్తున్న అధికారులు మిడ్ డే మీల్స్ నిర్వహణలో అవకతవకలు చూపినందుకు, దేశ అత్యున్నత రాష్ట్రపతి, ప్రధాని ఉత్తర్వులు సైతం బే ఖాతరు చేస్తున్నారు. రాష్ట్ర సీఎం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ టు, ప్రిన్సిపుల్ విద్యాశాఖ సెక్రెటరీ ఆదేశాలు సైతం విద్యాశాఖ అధికారులు లెక్కచేయడం లేదు. కారణాలు లేకుండా, ప్రూఫ్ చూపకుండగా ఇంక్రిమెంట్ లు కట్ చేసిన అధికారులు ఏడేళ్ళుగా సస్పెన్షన్ ఉత్తర్వులకు కారణాలు చూపాలని, అన్ని ఆధారాలు నాదగ్గర ఉన్నాయని, అందుకు ఎదురుచూస్తున్న గతంలో కోసిగి హెచ్ ఎం. ప్రస్తుతం ఎమ్మిగనూరు మాచాని బాలికల ఉన్నత పాఠశాల హెచ్ ఎం పోరాటంలో విసిగి వేసారి రిటైర్డ్ కు దగ్గరలో ఉన్న బాదితుడు హెచ్ .ఎం, కె. కృష్ణమూర్తి ఆవేదన ఎవరు పట్టించుకోవడం లేదు. నిజాయితీకి దక్కిన గౌరవం, సస్పెన్షన్ కు ఎవిడెన్స్ కారణమూ లేదు, సస్పెన్షన్ అమ్మ ఒడి ప్రూఫ్స్ ఎవిడెన్స్‌ఉత్తర్వులు లేవు, అయినా ఇంక్రిమెంట్ లు కట్ చేస్తున్న అధికారులు, మిడ్ డే మీల్స్ నిర్వహణలో అవకతవకలు చూపినందుకు కక్ష పెట్టుకుని వేదిస్తున్నారని, తప్పుడు ఆధార్ తో విద్యార్థికి అమ్మబడి అమౌంట్ రాలేదని, తీరా ఆ ఆధార్ భోగస్ అని తెలుసుకుని అధికారులు మళ్ళీ ఆధార్ తీయించి మళ్ళీ తప్పు చేసిన అధికారులు అని గతం లో కోసిగి హైస్కూల్ హెచ్ .ఎం ,గా విధులు, ప్రస్తుతం ఎమ్మిగనూరు మాచాని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ, రిటైర్డ్ కు దగ్గర లో ఉన్న కె.కృష్ణమూర్తి విలేకర్ల ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కే .కృష్ణమూర్తి మాట్లాడుతూ గతంలో కోసిగి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గా 1.9.2017 న రెగ్యులర్ హెచ్.ఎం, గా పనిచేశానని, ఆ పాఠశాలలో గత 22 సంవత్సరముల నుండి జిల్లా, డివిజన్, మండల అవినీతి విద్యాధికారులు, పాఠశాల ప్రభుత్వ అవినీతి ఉద్యోగులు, కలిసి పాఠశాల మిడ్ డే మీల్స్ నిర్వహణలో అవకతవకలు జరిగినందున, ఈ అవకతవకలను నేను బహిర్గతం చేస్తానని ఉద్దేశపూర్వకముగా నన్ను 2019-20 సంవత్సరంలో అమ్మబడి పథకంలో భాగంగా నమోదులో ఇరికించారని, వారు చేసిన అవినీతి పనులకు, ప్రస్తుతము ఎండిఎం అవినీతి పనులకు అడ్డువస్తానని, గత 22 సంవత్సరముల నుండి జరిగిన ఎండిఎం అవినీతి పనులు బహిర్గతం చేస్తానని, నా నుండి రూ.3 లక్షలు ఆశించి నన్ను కావాలని బలిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందు నిమిత్తం నేను మండల స్థాయి అధికారులు నుండి దేశ అత్యున్నత స్థాయి వరకు తాను నా నిజాయితీ కొరకు, నాకు న్యాయం కొరకు పోరాటం చేసిన తీరు ఈ కింద విధంగా గతంలో ఇంచార్జ్ హెడ్మాస్టర్ వివరించారు. 1.9.2017 న మిడ్ డే మీల్స్ బియ్యం ఈయన పేరు మీద పాఠశాల బియ్యం వచ్చేదని, గత 22 సంవత్సరములుగా పాఠశాల బియ్యంలో అవకతవకలు జరుగుట, 2011 సంవత్సరము నుండి ఇంచార్జి హెడ్ మాస్టర్ మిడ్ డే మీల్స్ వివరాలు రెగ్యులర్ హెడ్మాస్టర్ కు ఇవ్వలేదని, కారణం గత 22. సంవత్సరములు బియ్యం అమ్మకాలలో అవినీతి అధికారులకు ,మండల విద్య ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధం ఉన్నట్లు కోసిగి గ్రామ ప్రజలు 20.8.2020 తేదీన జిల్లా విద్యాధికారికి పిర్యాదు చేసారాని తెలిపారు. పాఠశాల బియ్యము 2011 సంవత్సరం నుండి 7 .6 .2023 వరకు ఇంచార్జి హెచ్ ఎం పేరు మీదనే రైస్ సప్లై నుండి పాఠశాలకు బియ్యం వచ్చేదని, ప్రస్తుత అవినీతి పనులకు అడ్డు వస్తానని, గత 22 సంవత్సరముల అవినీతి బియ్యము బయట పెడతానని, నాతో రూ.3 లక్షలు డబ్బులు అశించి రెగ్యులర్ హెడ్మాస్టర్, కె.కృష్ణమూర్తి అయిన నన్ను 2019-20 అమ్మ ఒడి నమోదులో ఉద్దేశపూర్ణముగా బలిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా అమ్మ ఒడి తప్పుడు రిపోర్టులు , ఎండీఎం తప్పుడు రిపోర్టులు, రిపోర్టులు తారుమారు చేసి,2.9.2022 డిస్కప్లైనరీ అథారిటీ ఆఫీసర్, ఆర్ జేడీ తప్పుడు రిపోర్టు(అమ్మ ఒడి 6 అంశముల ప్రూఫ్స్ ఎవిడెన్స్ తారుమారు చేయుట) తప్పించుకొనుటకు ఎన్నో వక్రమార్గాలు అక్రమ మార్గాలు చేసి కృష్ణమూర్తి అయిన నన్ను సస్పెన్షన్ చేయించారని, 1.9.2017 తేదీన జిల్లా పరిషత్ హైస్కూల్ కోసిగి రెగ్యులర్ హెడ్మాస్టర్ గా జాయినింగ్ అయినానని తెలిపారు. గత ఆరు సంవత్సరాలనుండి ఇంచార్జ్ హెడ్మాస్టర్ , మిడ్డే మీల్స్ వివరాలు హ్యాండెడ్ ఓవర్ చేయలేదని, తేదీన డివైఓ, క్యాంపు క్లర్కు కు గత 22 సంవత్సరాల నుండి దొంగ మార్గంలో బియ్యం అమ్ముతున్నారని తెలిపారు. 10.11.2017, 5.2.2018,18.5 .2018, 24.10 .2018,10.12 .2018తేదీన ం గత 22 సంవత్సరముల నుండి బియ్యంఅ మ్ముకొనుచున్నారని తెలియజేయుట. తేదీన ఆఎవనీ – ఓవనీ కి, గత 22 సంవత్సరముల మిడ్ డే మీల్స్ బియ్యము. దొంగ మార్గములో అమ్ముతున్నారని తెలియజేయుట. తేదీన డివైఈవో, క్యాంప్ క్లర్కు , ళిజూష్త్రబ టనీతీ ఎనీఎబ ఎనీబతిణతి ఒనినిబీవశ్రీ తినిజూవఇబితినీని పాఠశాలను చేయు సందర్భంలో మిడ్ డే మీల్స్ అవినీతిని తెలియజేయుట, తేదీన డిస్ట్రిక్ట్ మోనోటరింగ్ ఆఫీసర్ కర్నూల్ గారికి మిడ్ దే మీల్స్ అవినీతిని తెలియజేయుట. 9.11.2020 తేదీన జిల్లా విద్యాధికారి గారికి గత 22 సంవత్సరముల మిడ్ డే మీల్స్ అక్రమముగా అమ్ముకొనుట గురించి తెలియజేయుట. పాఠశాల రైసు గతఇంచార్జ్ హెడ్ మాస్టర్ ఈ.సుధాకర్ గారి పేరు మీద 7.6.2023 వరకు వస్తుందని ప్రూఫ్. ఎవిడెన్స్ చూపించు ట, జరిగినది. గత 22 సంవత్సరముల నుండి తీతిఇవ తీవశ్రీవజీబవట ,ఆర్. ఓ. ఆర్ రిసిప్స్, ప్రూఫ్ ఎవిడెన్స్ చూపించడం జరిగినది. ఈ కక్షతో మిడ్ డే మిల్స్ పిలిమినరీ ఎంక్వయిరీలో తప్పుడు రిపోర్టు, మిడ్ డే మీల్స్ రిపోర్టును తారుమారు చేసి, వ్రాయటం జరిగినది. మిడ్ డే మీల్స్ ఫైనల్ ఎంక్వయిరీ లో ఓఆఓ ఎంక్వైరీ, ఔనీబి జూతీనీలవట జీనిట నినీబి ఇనీతీతీవఇబి అని రుజువైనది. రెగ్యులర్ ఊఓ నిర్దోషి అని లిఖిత పూర్వకముగా రిపోర్టు రాయడం జరిగింది. ఈ మిడ్ డే మీల్స్ కు సంబంధించిన 13 అంశములకు ప్రూఫ్ ఎవిడెన్స్ జిరాక్స్ కాపీలు ఇవ్వమని, మరియు అమ్మ ఒడి ఆరు ప్రూఫ్ ఎవిడెన్స్ జిరాక్స్ కాపీలు ఇవ్వమని, గౌరవనీయ భారతదేశ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపతి, గౌరవనీయ భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఇవ్వమని ఆదేశించినప్పటికీ సంబంధిత జిల్లా, మండల, డివిజనల్, ప్రాంతీయ, సంచాలకులు ఆర్ జె డి విద్యాధికారులు, పాఠశాలసంబంధిత ప్రభుత్వ ఉద్యోగులు 13 అంశములు మిడ్డి మీల్స్,ప్రూఫ్ ఎవిడెన్స్,6 అంశములు అమ్మ ఒడిప్రూఫ్స్ ఎవిడెన్స్ బాధితులకు ఇవ్వడం లేదు. కారణము గత 22 సంవత్సరముల అవినీతి మిడ్ డే మీల్స్ బయటపడుతుందని ఉద్దేశంతో బాధితులకు ఇవ్వడం లేదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ పది సార్లు పైగా ఇవ్వమని ఆదేశించినప్పటికీ ప్రూఫ్ ఎవిడెన్స్ ఇవ్వడం లేదు, ఏపీ ఐఏఎస్ రాష్ట్ర ఉన్నత విద్యాధికారులు 50సార్లు పైగా ఇవ్వమని ఆదేశించినప్పటికీ మిడ్ డే మీల్స్ ప్రూఫ్ ఎవిడెన్స్ బాధితులకి ఇవ్వడం లేదు. 60 సార్లు పైగా ఆర్ టి ఐ యాక్ట్ కింద ప్రూఫ్ ఎవిడెన్స్ అడిగిన కూడా బాధితులకి ఇవ్వడం లేదు. భారతదేశ అత్యున్నతమైన స్థానంలో ఉన్నటువంటి రాష్ట్రపతి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, ఐఏఎస్ అధికారులు ఆదేశించినప్పటికీ అమ్మ ఒడి,మిడ్ డే మీల్స్ ఎవిడెన్స్ సంబంధిత విద్యాధికారులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 28.6.2021 తేదీ అమ్మ ఒడిఫైనల్ ఎంక్వయిరీ రిపోర్ట్ ను, తుది తీర్పు నిర్ణయం తీసుకుంటారు. ఇందులో ఆధార్ నంబరు తప్పుగా నమోదు చేసినారని సస్పెండ్ చేసి, రెండు ఇంక్రిమెంట్లు హోల్డింగ్ లో పెట్టినారు కర్నూల్ ఏడి- 1, గత 2021 సంవత్సరము నుండి ఆధార్ కార్డు జిరాక్స్ ఇవ్వమని అడుగుతున్నాను ఇవ్వడం లేదు. నిర్లక్ష్యంతో ఆధార్ జిరాక్స్ ఇవ్వడం లేదు. అదేవిధంగా అమ్మ ఒడి ప్రిలిమినరీ ఎంక్వయిరీ రిపోర్టులో, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, ఆధార్ కార్డు తప్పుగా నమోదు చేసినారని దురుద్దేశంతో నన్ను సస్పెన్షన్ చేయించినారు. నేను 22.9.2020తేదీ నుండి ఆధార్ కార్డు జిరాక్స్ ఇవ్వమని కోరుచున్నా, తప్పనిసరిగా నాకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

## స్వర్ణపంచాయతీ పోర్టల్ ద్వారా ఇంటి పన్నులు చెల్లింపులు జరగాలి-ఆదోని డివిజనల్ డెవలప్మెంట్ అధికారి బాలకృష్ణా రెడ్డి




మంత్రాలయం , ఫిబ్రవరి 18,(శ్రీచక్ర) : స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఇంటి పన్నులు మరియు ఇతర పన్నులు చెల్లింపులు తప్పనిసరి జరగాలని ఆదోని డివిజనల్ డెవలప్మెంట్ అధికారి బాలకృష్ణా రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన మంత్రాలయం లోని పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, పన్నులు మరియు పన్నే తరముల వసూళ్ల శాతం, బకాయిల స్థితి, తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీ అభివృద్ధి అధికారి ఇంటింటి కీ వెళ్లి పన్నులు వసూలు పూర్తి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వర్ణపంచాయతీ పోర్టల్ ద్వారా అన్ని పన్నులు మరియు పన్నేతరముల చెల్లింపులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లోనే జరగాలని ఆయన తెలిపారు. గ్రామీణాభివృద్ధి మరియు పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 25వ తేదీ లోపు 100శాతం పన్నులు వసూళ్లు చేయాలని స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు సంబంధిత పంచాయతీ అభివృద్ధి అధికారులు ( పిడిఓలు) , డిప్యూటీ ఎంపీడీఓ తక్షణ చర్యలు తీసుకుని, పన్నులు మరియు బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని , ప్రతి అధికారిని సమన్వయం చేసుకొని గడువులోపు వసూళ్లు ను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ నూర్జహాన్ మంత్రాలయం మండలం , డిప్యూటీ ఎంపీడీఓ రామాంజనేయులు , పీడీఓ ఉపేంద్ర రెడ్డి ,బిల్ కలెక్టర్ హనుమంతు, మరియు పంచాయతీ సిబ్బంది ,ఇతర పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

## ఆపద మిత్ర ట్రైనింగ్‌కు రిజిస్టర్ చేసుకోవాలి



రామచంద్రపురం, ఫిబ్రవరి 18( శ్రీచక్ర)భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో యువ ఆపద మిత్ర ట్రైనింగ్ పొందడానికి యువత రిజిస్టర్ చేసుకోవాలని స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ పి.రాంబాబు పిలుపునిచ్చారు. రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆపద మిత్ర ప్రోగ్రామ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉన్న వారు ఆపద మిత్ర ట్రైనింగ్ పొందడానికి అర్హులన్నారు. ట్రైనింగ్ పొందడానికి రిజిస్టర్ చేసుకున్న వారికి వారం రోజుల పాటు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ట్రైనింగ్‌లో భాగంగా భూకంపాలు, వరదలు, తుఫాన్లు వంటి విపత్తులు సంభవించినప్పుడు ఆపద మిత్రలు అందించే సేవలపై శిక్షణనిస్తారన్నారు. ఈ శిక్షణలో భాగంగానే భారత్ స్కౌట్ అండ్ గైడ్స్‌పై ప్రాథమిక అవగాహన కూడా కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం సర్టిఫికేట్లు, రూ.10వేల విలువైన కిట్లు అందజేస్తారన్నారు. ఈ నెల 23వ తేదీలోగా ఆపద మిత్ర ట్రైనింగ్ పొందడానికి యువకులు గూగుల్ లింక్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా నిర్వహించే ట్రైనింగ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వి.రమణ, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, అధ్యాపకులు గుత్తుల సత్యదుర్గారావు, బి.రవికుమార్, డాక్టర్ ఎన్.లక్ష్మి, డాక్టర్ ఎన్.సుజాత, కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఓబీసీ తిరుపతి జిల్లా కార్యదర్శి పిచ్చిక సూరిబాబు దేవాంగ అభ్యుదయ సేవా సంఘం శుభాకాంక్షలు,వేద ఆశీర్వాదములు



సూళ్లూరుపేట,పిబ్రవరి18(శ్రీచక్ర):తిరుపతి జిల్లా లో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి గా నియమితులైన పిచ్చిక సూరిబాబు ని ఘనంగా దేవాంగ అభ్యుదయ సేవా సంఘం కన్వీనర్ గుత్తి త్యాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు,వేద పండితుల ఆశీర్వాదములు అందజేయడం జరిగింది. సూరిబాబు ప్రజా సేవలో మంచి గుర్తింపు పొంది ఇంకా ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో శ్రీమద్ వెంకటరామమూర్తి ఆలయ ట్రష్టి బీరక రాంబాబు,కమిటీ సభ్యులు, దక్షిణ భారత దేవాంగ సంక్షేమ సంఘ సమాఖ్య ఉపాధ్యక్షులు మన్నెముద్దు శ్రీనివాసులు,బీరక శ్రీను,పిచ్చిక శ్రీను,కే గోవిందశెట్టి,విశ్రాంత శ్రీహరికోట ఉద్యోగి గుత్తి చెంగళ్వరాయం,ప్రముఖ వస్త్ర వ్యాపార వేత్త పెన్నెం రవి తదితరులు పాల్గొన్నారు. సూరిబాబు సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ అభివృద్ధి కమిటీ సలహా సభ్యులు గా సేవలందించారు. దేవాంగ అభ్యుదయ సేవా సంఘం టైలర్స్ విభాగం స్టేట్ కో ఆర్డినేటర్ గా భాద్యతలు నిర్వహిస్తూ తనదైన శైలిలో సేవలు అందిస్తున్నారు. సూరిబాబు కు అవకాశం కల్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి,తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షులు సామంచి శ్రీనివాస్,జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యవేడు మునికృష్ణయ్యకు ధన్యవాదములు తెలిపారు.

# మతసామరస్యానికి ప్రతీక ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**బైర్లూటి ముర్తుజావలి దర్గాలో ఎంపీ ప్రత్యేక ప్రార్థనలు, చాదర్ సమర్పణ**

**బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్. షబానా**



ఆత్మకూరు, ఫిబ్రవరి 18 (శ్రీచక్ర): కులాలు, మతాల కంటే మానవత్వమే మిన్న అని, అందరినీ సమానంగా గౌరవించడమే నిజమైన ప్రజాస్వామ్యమని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి మరోసారి చాటిచెప్పారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, శ్రీశైలం బీజేపీ అసెంబ్లీ ఇంచార్జి మోమిన్ షభానా అన్నారు. బుధవారం ఆత్మకూరు బిజెపి అసెంబ్లీ కార్యాలయంలో షభానా మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి శ్రీశైల పుణ్య క్షేత్రంకు నల్లమల అరణ్యంలో కాలినడకన వెళ్తుతున్న సందర్బంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాదయాత్రకు సంఘీభావం తెలిపాం అన్నారు. ఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధిగాంచిన బైర్లూటి ముర్తుజావలి దర్గాను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రతి ఏటా కాలినడకన అరణ్యం గుండా వెళ్లుతూ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, అత్యంత భక్తిశ్రద్ధలతో చాదర్ సమర్పించడం ప్రత్యేకం అన్నారు. శ్రీశైల నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని బీజేపీ నాయకురాలు షబానా ఆకాంక్షించారు.ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మతసామరస్యానికి నిలువుటద్దం అని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా కొనియాడారు. హిందూ పండుగైన శివరాత్రి వేళ శ్రీశైల మల్లికార్జునుడి దర్శనానికి వెళ్తూ, మార్గమధ్యలో ఉన్న దర్గాను సందర్శించడం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విశాల హృదయానికి నిదర్శనమన్నారు, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేవలం ఒక వర్గానికో, కులానికో పరిమితమైన నాయకురాలు కాదని. హిందూ, ముస్లిం, క్రైస్తవ.. ఇలా అందరినీ తన కుటుంబ సభ్యుల్లా భావించే గొప్ప సంస్కారం ఆమెదని, రాజకీయాలకు అతీతంగా, మతాల మధ్య దూరాన్ని తగ్గించి అందరినీ ఏకం చేయడమే లక్ష్యంగా ఎంపీ శబరి సాగిస్తున్న ఈ పర్యటన నియోజకవర్గంలో ఐక్యతకు కొత్త అర్థాన్ని ఇస్తోందని. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, ప్రతి దైవ ప్రార్థనలోనూ ప్రజా క్షేమాన్ని కోరుకునే ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మతసామరస్యానికి నిలువుటద్దంలా నిలుస్తున్నారని బీజేపీ నాయకురాలు మోమిన్ షబానా అన్నారు. ఒకవైపు నల్లమల అరణ్యం శివనామ స్మరణతో శ్రీశైల యాత్ర చేస్తూనే, మరోవైపు దర్గాలో ప్రార్థనలు నిర్వహించిన ఎంపీ శబరి గారి తీరుపై స్థానిక ముస్లిం పెద్దలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, కులమతాల మధ్య చిచ్చు పెట్టే రాజకీయాలకు స్వస్తి పలికి, ఇటువంటి సామరస్య ధోరణి కలిగిన నాయకురాలు తమ ఎంపీగా ఉండటం గర్వకారణమని ముస్లిం మత పెద్దలు, బీజేపీ నాయకురాలు మోమిన్ షబానా పేర్కొన్నారు.

## పొదుపు మహిళలు చైతన్య ప్రతీకలు :జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు, ఫిబ్రవరి 18 (శ్రీచక్ర): పొదుపు మహిళలు చైతన్య ప్రతీకలు గా నిలవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి పేర్కొన్నారు. బుధవారం కల్లూరు మండలం బస్తిపాడు గ్రామంలో నిర్వహించిన స్వయం సహాయక సంఘాల మండల సమాఖ్య సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సమాఖ్య సభ్యులతో సంభాషించారు. సంఘాల మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పెంచుకొని ఆర్థికంగా బలపడాలని కలెక్టర్ సూచించారు. మహిళా సంఘాలు కేవలం రుణాలు తీసుకునే వేదికగా కాకుండా, గ్రామాభివృద్ధికి దారితీసే చైతన్య వేదికలుగా మారాలని పేర్కొన్నారు. గ్రామంలోని పొదుపు మహిళలు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, సమాజంలో మంచి మార్పుకు కారకులవ్వాలని పిలుపునిచ్చారు. ప్రతి నెల నిర్వహించే సమీక్ష సమావేశాల్లో వ్యక్తిగత అభివృద్ధి మాత్రమే కాకుండా గ్రామం, సమాజ అభివృద్ధికి సంబంధించిన అంశాలను చర్చించి, తీసుకున్న నిర్ణయాలను కచ్చితంగా ఆచరణలో పెట్టాలని ఆదేశించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, గర్భిణీల ఆరోగ్యం, విద్య ప్రాధాన్యం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అక్షరాంధ్ర కార్యక్రమంపై ప్రత్యేకంగా చర్చిస్తూ గ్రామంలో ఎంతమంది నమోదు అయ్యారో వివరాలు తెలుసుకున్నారు. చదువురాని ప్రతి ఒక్కరూ సాయంత్రం బడికి హాజరై అక్షరాభ్యాసం నేర్చుకోవాలని సూచించారు. చదువు వల్ల వ్యక్తిగత గౌరవం పెరుగుతుందని, మోసాలకు గురికాకుండా జాగ్రత్తపడగలరని తెలిపారు. ప్రతి ఒక్కరికి అక్షరాస్యత కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతం కావడంతో ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని సూచించారు. రసాయన రహిత వ్యవసాయం ద్వారా ఆరోగ్యం, ఆదాయం రెండూ మెరుగవుతాయని చెప్పారు. కొన్ని ఇళ్లలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయడం అభినందనీయం అని, మరిన్ని కుటుంబాలు కూడా వాటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రక్తహీనత నివారణకు పౌష్టికాహారం, ఐరన్ మాత్రల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి ఆదేశించారు. గ్రామాభివృద్ధి కోసం మహిళల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, సంఘాల ద్వారా సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావాలని కలెక్టర్ మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, తహశీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో నాగశేషాచలారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


## ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు పత్తికొండ డిఎస్పీ శ్రీ వెంకట రామయ్య





పత్తికొండ, ఫిబ్రవరి 18 (శ్రీచక్ర): కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పత్తికొండ సబ్ డివిజన్ పరిధిలోని ఆస్పరి మండలం , జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులకు బుధవారం పత్తికొండ డిఎస్పీ వెంకట రామయ్య పర్యవేక్షణలో మహిళలపై జరిగే నేరాలు, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోషల్ మీడియా, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు వంటి సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించాల్సిన డయల్ 112 , డయల్ 100 , 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ గురించి , పోలీసు సేవల గురించి వివరించారు.ఎంఖీూ కాల్స్‌కు ఏ విధంగా స్పందించాలో తెలియజేశారు. విద్యార్థులు చట్టాల పై అవగాహన కలిగి బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని, సమాజంలో జరిగే నేరాలను నిరోధించడంలో పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పరి సిఐ గంగాధర్, పోలీసు స్టేషన్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, ఆస్పరి గ్రామ జీఎంఎస్కేలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు కిందకు పడి వ్యక్తి మృతి



మంత్రాలయం , ఫిబ్రవరి 18,(శ్రీచక్ర) : ప్రమాదవశాత్తు ఇంటి మిద్దే పై నుంచి కిందపడి వ్యక్తిమృతిచెందినసంఘటనమంత్రాలయం లో చోటుచేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన మేరకు మంత్రాలయం గ్రామానికి చెందిన చాకలి వీరేష్ తన ఇంటి మిద్ద మీద ఉన్న డ్రమ్ముకు నీళ్ళుపడుతుండగా ప్రమాదవశాత్తు ఇంటి మిద్దె పై నుంచి కిందకుపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో ఆయనను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదోని హస్పిటల్ కు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు కు తీసువెళ్ళగా కోలుకోలేక మృతి చెందినట్లు , కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలి:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



కర్నూలు, ఫిబ్రవరి 18 (శ్రీచక్ర): పదవ తరగతి విద్యార్థులు రాబోయే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదువుకుంటే మంచి ఉత్తీర్ణత సాధించడం సాధ్యమని పేర్కొన్నారు. బుధవారం కల్లూరు మండలం చిన్న టేకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, ముందుగా పాఠశాలలో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని పరిశీలించారు. వంటగది నిర్వహణ, నిల్వలు, త్రాగునీటి సదుపాయాలపై అధికారులను ప్రశ్నించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనంపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ విద్యా ప్రగతిపై సమీక్షించారు. ప్రభుత్వం రూపొందించిన వంద రోజుల ప్రణాళిక ను పూర్తిస్థాయిలో అమలు చేసుకుని ప్రతిరోజూ పునశ్చరణ చేయాలని సూచించారు. ముఖ్యంగా గణితం, ఇంగ్లీష్, సైన్స్ వంటి బలహీన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఉపాధ్యాయుల సహకారంతో సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు టైమ్ టేబుల్ రూపొందించుకుని చదువుకు కేటాయించిన సమయాన్ని కచ్చితంగా పాటించాలని, గత సంవత్సరాల ప్రశ్నపత్రాలను సాధన చేయాలని, మోడల్ పరీక్షలను సీరియస్ గా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా ఎదుర్కోనాలని, ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యా వాతావరణాన్ని మెరుగుపరచడంతో పాటు తల్లిదండ్రులతో సమన్వయం పెంచి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పదవ తరగతి ఫలితాలు జిల్లాకు గౌరవప్రదంగా ఉండాలని, ప్రతి పాఠశాల మంచి ఫలితాల కోసం కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అసుదుల్లా ఖాన్, సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ లోక్ రాజు, తహశీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో నాగశేషాచలారెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం ద్వారా అటు ఆరోగ్యం.. ఇటు ఆదాయంజిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి





కర్నూలు, ఫిబ్రవరి 18 (శ్రీచక్ర): ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యం తో పాటు రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి రైతులకు సూచించారు. బుధవారం కల్లూరు మండలం బస్తిపాడు గ్రామంలోని ఈశ్వరయ్య అనే రైతు పండిస్తున్న శనగ, మొక్కజొన్న పంటలను, షకీర్ బాషా, శామీర్ పండిస్తున్న బెండ, మల్లె పంటను,రవి పండిస్తున్న ఆకుకూరల పంటను, హనీఫ్ పండిస్తున్న బొండు మల్లె పంటలను కలెక్టర్ క పరిశీలించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ శనగ పంటకు ఎకరానికి 7,500 రూపాయల పెట్టుబడి పెట్టానని, ఎకరానికి 20 వేల రూపాయల దాకా, మొక్కజొన్న పంటకు ఎకరానికి30వేలరూపాయలు పెట్టానని, 54 వేల రూపాయలు ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జీవామృతం, వేప గింజల కషాయం ద్వారా పంటలు సాగు చేస్తున్నానని కలెక్టర్ కు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా శనగ, మొక్కజొన్న పంటలను పండిస్తున్న రైతు ఈశ్వరయ్య ను కలెక్టర్ అభినందించారు. ఈశ్వరయ్యను మిగిలిన రైతులందరూ స్ఫూర్తిగా తీసుకొని ప్రకృతి వ్యవసాయం చేయాలని కలెక్టర్ అక్కడే ఉన్న రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో రైతులకు ఆదాయం ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఎరువుల వాడకం తగ్గించడం వల్ల పండే ఆహారం విషరహితంగా ఉంటుందన్నారు. ఇది ప్రజలు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుందన్నారు. ప్రకృతి సిద్ధమైన పద్ధతుల వల్ల భూసారం దెబ్బతినకుండా ఉంటుందని, ఇది భవిష్యత్తు తరాలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి అని తెలిపారు. షకీర్ బాషా, శామీర్, రవి, హనీఫ్ అనే రైతులతో మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందులపై ఆధారపడకుండా జీవామృతం, ఘనజీవామృతం తదితర కషాయాలను వాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయాలని కలెక్టర్ సూచించారు. శనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతోందని, వీటిని వినియోగించుకోవాలని రైతులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, కల్లూరు తహసిల్దార్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## జనవాసాల్లో పందుల పెంపకం నిషేధం

**శివారు ప్రాంతాలకు తరలింపు తప్పనిసరి**

**యుఎల్‌బి మానిటరింగ్ కమిటీలో కమిషనర్ పి.విశ్వనాథ్**



కర్నూలు, ఫిబ్రవరి 18 (శ్రీచక్ర): నగర పరిధిలో జనవాసాల్లో పందుల పెంపకానికి ఏమాత్రం అనుమతి లేదని, ప్రజా ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా పందులను తప్పనిసరిగా శివారు ప్రాంతాలకు తరలించాల్సిందేనని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. పందుల పెంపకానికి ప్రత్యామ్నాయంగా శివారు ప్రాంతాల్లో స్థలాలను కేటాయించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వెంకటరమణ కాలనీలోని నగరపాలక కార్యాలయంలో యుఎల్‌బి స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాల మార్గదర్శకాలు, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జనవాసాల్లో పందుల పెంపకానికి అవకాశం లేదని తెలిపారు. పందుల పెంపకానికి బస్తాపాడు గ్రామంలో నాలుగు ఎకరాల భూమిని కేటాయించే అంశాన్ని ప్రతిపాదించగా, పెంపకదారులు మరో రెండు ప్రాంతాల్లో స్థలాలు ఇవ్వాలని కోరిన విషయాన్ని పరిశీలించి సాధ్యాసాధ్యాలను నివేదికగా సమర్పించాలని రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. శివారు ప్రాంతాల్లో చూపిన ప్రదేశాలకు పందులను తరలించడం తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో తహసీల్దార్ డి.రవికుమార్, 2వ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ నాగరాజు రావు, పశుసంవర్ధక శాఖ ఏడి బి.మల్లన్న, డిప్యూటీ డైరెక్టర్ జి.మాధవ్, డిప్యూటీ తహశీల్దార్ ఆర్.విష్ణు ప్రసాద్, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్యఅధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# శుభాల రంజాన్ మాసానికి స్వాగతం,పవిత్ర మాసం సద్దుద్దేశాన్ని చాటిచెబుదాం,వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్,



మార్కాపురం ఫిబ్రవరి 18 (శ్రీ చక్ర)మార్కాపురం శుభాల రంజాన్ మాసానికి స్వాగతం చెబుదాం...ఈ పవిత్ర మాస సద్దుద్దేశాన్ని యావత్తు సమాజానికి చాటిచెబుదామని వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ పిలుపునిచ్చారు. రంజాన్ మాసం ప్రారంభం నేపథ్యంలో ఆయన తన సందేశాన్ని వ్యక్తంచేశారు. రంజాన్ మాసంలో ముస్లింలు పాటించే ఉపవాస దీక్ష ఉద్దేశం పేదోడి ఆకలి బాధను అర్థంచేసుకొనేందుకేనని ఆయన పేర్కొన్నారు. పేదోడి ఆకలి తీర్చి రంజాన్ మాసంలో పాటించే శాంతియుత జీవన విధానం మిగితా పదకొండు మాసాలు పాటించేలా ప్రేరేపించడమే ఈ పవిత్ర మాసం ఉద్దేశమని ఆయన వెల్లడించారు. ఈ సందేశాన్ని ప్రతి ఒక్క ముస్లిం యావత్తు సమాజంలో బలంగా తీసుకెళ్లి మన దేశ భిన్నత్వంలో ఏకత్వం కోసం పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. మంచి సందేశాన్ని పాటించడమే కాదు వాటిని యావత్తు సమాజానికి తెలియజేస్తేనే సమసమాజ లక్ష్యం, ఆకలి లేని రాజ్యం, శాంతియుత జీవన విధాన సమాజం ఏర్పాటుకు కారణమవుతుందని ఆయన వెల్లడించారు

# స్ఫూర్తి వెల్ఫేర్ నందు వివాహ వార్షికోత్సవం జరుపుకున్న వైస్ గవర్నర్ పోలేపల్లి



మార్కాపురం ఫిబ్రవరి 18 (శ్రీ చక్ర)మార్కాపురం (స్ఫూర్తి వెల్ఫేర్) మానసిక వికలాంగుల స్కూలు నందు ఎ207౦ వైస్ గవర్నర్ పోలేపల్లి లక్ష్మీనారాయణ వివాహ వార్షికోత్సవం జరుపుకోవడం జరిగింది అనంతరం పిల్లలకు పండ్లు బ్రెడ్లు బిస్కెట్ ప్యాకెట్లు వాళ్లకు అందజేయడం జరిగింది అనంతరం క్లబ్ సభ్యులు ఆయనకు దుశాల్వాత ఘనంగా సత్కరించడం జరిగింది ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మానవతా దృక్పథంతో వివాహ వార్షికోత్సవం జరుపుకోవడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ప్రతి ఒక్కరూ వారితో కలిసి జరుపుకుంటే మానసికంగా వారికి ఎంతో ఆనందంతో ఉంటారని ఆ ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ కామిశెట్టి నవీన్ కుమార్ సెక్రెటరీ కొత్త మాసు వెంకట మురళీకృష్ణ ట్రెజరీ అన్న రవికుమార్. క్లబ్ వ్యవస్థాక అధ్యక్షులు వెలుగురి వెంకటేశ్వర్లు మాజీ ప్రెసిడెంట్ లింగం పూర్ణచంద్రరావు మాజీ కార్యదర్శి పెసల సుబ్రహ్మణ్యం స్ఫూర్తి వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ అనిత మరియు అధ్యాపక. అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది

# .మార్కాపురం కలెక్టరేట్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. కలెక్టర్ రాజబాబు



మార్కాపురం ఫిబ్రవరి 18 (శ్రీ చక్ర)మార్కాపురం నూతన కలెక్టరేట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం మార్కాపురం వచ్చిన ఆయన కలెక్టరేట్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తిచేస్తే పరిపాలన అంతా కలెక్టరేట్ నుంచి నిర్వహించేందుకు వెసులుబాటు కలుగుతుందని ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా మెయిన్ రోడ్ నుంచి కలెక్టరేట్ వరకు ఇటీవల ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ ను ప్రత్యేకంగా పరిశీలించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించకుండా ముందుకు సాగాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, ఇంచార్జ్ సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, తాసిల్దార్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సైనికుల ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ నిరసన కార్యక్రమం

ప్రభుత్వం జీవోను వెంటనే విడుదల చేయాలి


దేశానికి సేవ చేసిన సైనికులకే న్యాయం జరగడం లేదు మహబూబ్ హోలీ ఆవేదన





మార్కాపురం ఫిబ్రవరి 18 ( శ్రీ చక్ర)మార్కాపురం: మాజీ సైనికులకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీఓ) ప్రకారం ఇళ్ల స్థలాలు మరియు భూములు తక్షణమే కేటాయించాలని డిమాండ్ చేస్తూ మార్కాపురం పట్టణంలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. స్థానిక జై జవాన్ యూనియన్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలోని సీపీఐ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది.ఈ నిరసనలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, దేశానికి సేవలందించిన మాజీ సైనికుల సంక్షేమం దృష్ట్యా గత ప్రభుత్వాలు 175 చదరపు గజాల ఇళ్ల స్థలం, అలాగే ఐదు ఎకరాల పొడి భూమి లేదా 2.5 ఎకరాల తడి భూమి కేటాయించేందుకు నిర్ణయాలు తీసుకున్నాయని గుర్తుచేశారు.మాజీ సైనికులు గత కొన్ని నెలలుగా తహసీల్దార్, సబ్ కలెక్టర్, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ తదితర అధికారులను పలుమార్లు కలిసి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సమస్యకు పరిష్కారం దొరకలేదని తెలిపారు. జీఓ అమలులో నిర్లక్ష్యం ఎందుకు జరుగుతోందో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన ప్రశ్నించారు.ఇకపై కూడా సమస్య పరిష్కారం కాకపోతే “చలో అమరావతి” అనే నినాదంతో శాంతియుతంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మాజీ సైనికుల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో మాజీ సైనికులు, వీరనారీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నారు.

# దాసుకుప్పం బైపాస్ రోడ్డునిర్మాణం కోసం ఎమ్మెల్యే అభివృద్ధి పట్టు



వరదయ్యపాలెం ఫిబ్రవరి 18(శ్రీ చక్ర) సత్యవేడు సీహెచ్ సీకి దయాలసిస్ కేంద్రం, మత్తు డాక్టర్ ను నియమించాలిఏపీ అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతన సత్యవేడు నియోజకవర్గంలో చిరకాలంగా నోచుకొని దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఏపీ అసెంబ్లీ లో బుధవారం పట్టుబట్టారు. అసెంబ్లీ సమావేశంలో బుధవారం తనకు అవకాశం కల్పించిన స్పీకర్ కు ఎమ్మెల్యే ఆదిమూలం ధన్యాదములు తెలుపుతూ.. ఎమ్మెల్యే ప్రసంగం ఆయన మాటల్లోనే.ఊత్తుకోట తమిళనాడు అధ్యక్షా.. సత్యవేడు నియోజకవర్గంలో 79 సంవత్స రాలుగా ఇప్పటికీ ఆ రెండున్నర కిలోమీటర్లు రోడ్డు వేసుకోలేక పోతున్నాము అధ్యక్షా..2001 ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర మన ముఖ్యమంత్రి ఈ (దాసుకుప్పం బైపాస్) రోడ్డును మంజూరు చేశారు.మన బండ్లు (సత్యవేడు) పోవాలన్నా.. నేను పోవాలన్నా కూడా తమిళనాడు పైనే పోవాలి. ఆవైపే అపోలో కంపెనీ, శ్రీసిటీ లోని సుమారు 300 ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీలకు పోవాలన్నా ఈ దారిలోనేపోవాలి. కనీసం 1.5 కిలోమీటర్ల తమిళనాడులో పోవ డం వల్ల చెక్ పోస్టులు పెట్టీ మన బండ్లు, ఆటోలన్నీ ఆపేస్తున్నారు. ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.ఈ సమస్యపై ప్రజలందరూ మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు.దీనిపై ప్రభుత్వం రూ.26 కోట్లు మంజూరు చేసింది. ఈ విషయాన్ని ఆర్ అండ్ బి మంత్రి, ముఖ్యమంత్రి తమరికి(స్పీకర్) కూడా చెప్పాను. రూ.26 కోట్ల లో రూ.6 కోట్లు ల్యాండ్ అక్విజషన్ కు రూ.20 కోట్లు రోడ్డు నిర్మాణానికి.ఈ రోడ్డు నిర్మాణానికి 4 రోజులు పాటు దగ్గరుండి సర్వే చేయించాను. ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు చిన్న పొరబాటు చేసి 150 అడుగులు విస్తీర్ణం కు సర్వే చేశారు. రోడ్డు నిర్మాణానికి 100 సరిపోతుందని అలైన్మెంట్ మార్చి మళ్లీ ప్రభుత్వానికి పంపించాం.ఇక్కడే మంత్రి కూడా ఉన్నారు.. గతంలో ముఖ్యమంత్రి కి కూడా ఈ ప్రతిపాదనను ఇచ్చాను. ఈ కాపీలన్నీ తమరికి(స్పీకర్) కూడా అందిస్తున్నాను.మనం చాలా రోడ్లు వేశాం.గుంతలు పూడ్చాం.ఇప్పుడు కూడా బడ్జెట్ లో రూ.9856 కోట్లు రోడ్ల నిర్మాణానికి కేటాయించాం. ఈ రోడ్డు(దాసుకుప్పం బైపాస్) చాలా ఇంపార్టెంట్.. తమిళనాడు బార్డర్ కు వెళ్లకుండా మన భూమిలో వెళ్లడానికి ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేలా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలి అధ్యక్ష.వెంటనే స్పందించిన స్పీకర్ రఘురామకృష్ణరాజు ఈ రోడ్డు సమస్యను ‘మంత్రి కూడా నోట్ చేసుకున్నారు’అని చెప్పడం గమనార్హం.అలాగే సత్యవేడు లో సీ హెచ్ సీ హాస్పిటల్ ఉంది. అక్కడ ఉన్న శ్రీసిటీ లో చాలా కంపెనీలు.. అందులో చాలామంది ఉద్యోగులు.. కార్మికులు పనిచేస్తున్నారు.ఎన్ని ప్రైవేటు హాస్పిటల్ లు ఉన్నా దయాలసిస్ సెంటర్ లేక పోవడం వల్ల 100 కిలో మీటర్లు దూరం ఉన్న మద్రాసు, తిరుపతి పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది. కాబట్టి సత్యవేడులో దయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి. ఇక సత్యవేడు లో సీ హెచ్ సీ ఉన్నా మత్తు (అనస్థీషియా) డాక్టర్ లేదు. హఠాత్తుగా ఆక్సిడెంట్ జరిగితే పేషంట్ కు మత్తు ఇంజక్షన్ ఇచ్చే డాక్టర్ లేకపోతే ఎంత పెద్ద డాక్టర్ అయినా వైద్యం చేయలేదు.కాబట్టి మత్తు (అనస్థీషియా) డాక్టర్ ను, దయాలసిస్ సెంటర్ ను సత్యవేడు సీ హెచ్ సీ కి మంజూరు చేయాలని మంత్రి(ఆరోగ్య శాఖ) మమ్మల్ని(స్పీకర్) ని కోరుకుంటున్నాను.

# భూములను పరిశీలిస్తున్న రెవిన్యూ అధికారులు



కోట : ఫిబ్రవరి 18 (శ్రీ చక్ర):కోట మండలంలోని పుచ్చలపల్లి గ్రామంలోని పలు భూములను స్థానిక తహసీల్దార్ కటారి.జయ జయ రావు, రెవిన్యూ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా బుధవారం పుచ్చలపల్లి గ్రామంలో దుగరాజపట్నం పోర్టు నౌక నిర్మాణంలో భాగంగా పలు భూములు యొక్క వివరాలును రెవిన్యూ,స్థానిక రైతులతో కలిసి పరిశీలించడం జరిగింది.అయితే ప్రభుత్వ,అసైన్మెంట్,డి కే టి పట్టాల భూముల వివరాలును రెవిన్యూ రికార్డులు ఆధారంగా స్థానికులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, విఆర్వో పూడి కృష్ణయ్య,విలేజ్ సర్వేయర్ మౌలాలి,మాజీ మండల టిడిపి అధ్యక్షులు పాదర్తి.కోటారెడ్డి,తదితర రైతులు ఉన్నారు.

# మిడ్డే మీల్స్ నిర్వహణపై పర్యవేక్షణ



కోట : ఫిబ్రవరి 18 (శ్రీ చక్ర): కోట మండలంలోని చంద్రశేఖరపురం మండల ప్రజా పరిషత్ స్కూల్లో కోట మండల విద్యాశాఖ అధికారి దారా.మస్తానయ్య ఆకస్మికంగా బుధవారం మిడ్డే మీల్స్ ను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆ పాఠశాలలో పిల్లలకు అందించే భోజన నిర్వహణ పై ఆరా తీశారు. అదేవిధంగా మిడ్డే మీల్స్ నిర్వాహకరాలకు పలు సూచనలు, సలహాలను అందజేశారు.పిల్లలకు మెనూ ప్రకారం మిడ్డే మీల్స్ ను అందించాలని ప్రధానోపాధ్యాయులకు తెలియజేశారు.అనంతరం మండల విద్యాశాఖ అధికారి దారా.మస్తానయ్య పిల్లల యొక్క విద్యాభ్యాసంపై పలు ప్రశ్నలను అడిగి సమాధానాలను రాబట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వేళాంగిణి ఉన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన రాఘవేంద్రున్ని గురువైభవో త్సవాలు





మంత్రాలయం,ఫిబ్రవరి 18 ,(శ్రీచక్ర) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో గురు వైభవోత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో, గురు వైభవోత్సవాలను పురస్కరించుకొని, శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పంచామృతాభి షేకం, తులసి అర్చన, ఉత్సవ రాయల పాద పూజ, కనక మహాపూజ, నిత్య నిర్మల్య అభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేసి హారతి ఇచ్చారు. సంస్థాన పూజల్లో భాగంగా శ్రీ మూల రామ, దిగ్విజయరామ , జయ రామ, వేద వ్యాస, శ్రీకృష్ణ, నరసింహ స్వామి దేవతా మూర్తులకు విశేష పంచామృతాభి షేకం నిర్వహించి దూప దీప నైవేద్యం సమర్పించి మంగళహారతి ఇచ్చారు . అనంతరం శ్రీరాఘవేంద్రుడి నిజ మూల బృందావనానికి పట్టు వస్త్రాలు, స్వర్ణ కవచాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ప్రత్యేక హారతి ఇచ్చారు. మృత్తిక బృందావనాన్ని స్వర్ణపల్లకిలో ఉంచి మఠం ప్రాకారంలో ఊరేగించారు. భక్తులు ముందుగా గ్రామ దేవత శ్రీ మంచాలమ్మను దర్శించుకుని, స్వామి వారి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. రాత్రి ఉత్సవ మూర్తి శ్రీ ప్రహ్లాద రాయలను గజ, పల్లకి సేవ, కొయ్య, వెండి, బంగారు, నవరత్న రథోత్సవాలపై ఉంచి మఠం ప్రాకారంలో అశేష భక్తుల నడుమ ఘనంగా ఊరేగించారు. ఉత్సవ మూర్తికి ఉయ్యాల సేవ చేసి మహా మంగళహారతి ఇచ్చారు.

# 22 న రామచంద్రపురంలో ఉద్యోగ మేళా



రామచంద్రపురం, ఫిబ్రవరి 18( శ్రీచక్ర)రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ , సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ నిర్మూల కోసం వారం వారం రామచంద్రపురం ఉపాధిభవన్లో నిర్వహించే 36 వ జాబ్ మేళాలో భాగంగా ఈనెల 22వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించబడుతుందని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇంటర్వ్యూలో 18 నుంచి 27 సంవత్సరాల లోపు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ , ఐటిఐ, డిప్లమా చదివిన అభ్యర్థులకు 16 నుండి 18 వేల జీతంతో షిఫ్ట్ టైంలో భోజన, రవాణా సదుపాయం కల్పించే విధంగా చెన్నై మరియు బెంగళూరులో పనిచేసే విధంగా టెనెకో, యాన్ మార్,యాంబర్, మితోసి బీసీ ఎలక్ట్రిక్ కంపెనీలలో ప్రొడక్షన్ విభాగం నందు ఉద్యోగముల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడు తున్నాయి.మరిన్ని వివరాలకు 9515481671 ఫోన్ నెంబర్ లో సంప్రదించగలరన్నారు

# జేఈఈ జిల్లా టాపర్ సంజనకు ఘన సత్కారం



రామచంద్రపురం, ఫిబ్రవరి 18(శ్రీచక్ర)జేఈఈ మెయిన్స్ లో జిల్లా టాపర్గా నిలిచిన సంజనను హసన్ బాధ గ్రామ సర్పంచ్ సతీష్ రావు ఘనంగా సత్కరించారు.జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుందరి ఆధ్వర్యంలో ఈ సత్కారం జరిగింది.రామచంద్రపురం మండలం హసన్ బాద గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పచ్చిపాల వీర వెంకట సత్యనారా యణ కుమార్తె పచ్చిపాల సంజన హసన్ బాద గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసి మోడ్రన్ విద్యాసంస్థలో ఇంటర్ చదువుతూ ఆ సంస్థ అధినేత జి. వి.రావు ప్రోత్సాహంతో జె.ఇ.ఇ మెయిన్స్ లో 97.5 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి హసన్ బాద గ్రామానికి, మోడ్రన్ విద్యాసంస్థకు మంచి పేరు తెచ్చిన హసన్ బాద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో మోడ్రన్ విద్యాసంస్థల అధినేత జి.వి. రావును పచ్చిపాల సంజనను సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఘనంగా సత్కరించారు.సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి విద్యార్థిని జాతీయ స్థాయిలో రాణించడం హసన్ బాద గ్రామానికి గర్వకారణమని కొనియాడారు.గ్రామీణంలో ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహిస్తున్న జి.వి.రావును ప్రత్యేకించి అభినందించారు.మోడ్రన్ విద్యా సంస్థలో చదువుతూ జె.ఇ.ఇ.మెయిన్స్ లో ఉత్తీర్ణత సాధించిన వివిధ గ్రామాల తోటి విద్యార్థును కూడా సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు అభినందించారు.ఈ కార్యక్రమంలో మోడ్రన్ విద్యాసంస్థల సిబ్బంది పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# కొడాలి, వల్లభనేని విషయంలో కిం కర్తవ్యం



విజయవాడ, ఫిబ్రవరి 18, రాజకీయాల్లో కొన్ని నియోజకవర్గాలది ప్రత్యేక స్థానం. ముఖ్యంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలోని గుడివాడ, గన్నవరం నియోజకవర్గాలు ఎప్పుడు హాట్ గానే ఉంటాయి. దీనికి కారణం అక్కడ వరుసగా కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్ గెలుస్తూ రావడమే. ఇద్దరూ టిడిపి నుంచి తమ ప్రస్థానాన్ని ప్రారంభించిన వారి. అయితే ఉన్నఫలంగా వారిద్దరూ టిడిపి నాయకత్వంతో పాటు చంద్రబాబు తీవ్రంగా వ్యతిరేకించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.. ఇద్దరూ ఫైర్ బ్రాండ్లే. చంద్రబాబుతో పాటు లోకేష్ పై వ్యక్తిగత విమర్శలు చేస్తూ రాష్ట్రంలోనే గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో ఒకరు జైలుకు వెళ్లి అనారోగ్యానికి గురయ్యారు. మరొకరు వెళ్లకుండానే ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కొన్నారు. అయితే ఆ ఇద్దరూ యాక్టివ్ కాకపోవడంతో ఏం చేయాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పాలు పోవడం లేదు.కొడాలి నాని 2004 నుంచి 2019 వరకు వరుసగా నాలుగు సార్లు గుడివాడ నుంచి గెలిచారు. రెండుసార్లు టిడిపి నుంచి ప్రాతినిధ్యం వహించారు. మరో రెండు సార్లు వైసీపీ తరపున గెలిచారు. జగన్మోహన్ రెడ్డి ఆయనకు మంత్రిగా అవకాశం ఇచ్చారు. అయితే వ్యక్తిగత దూకుడుతో వివాదాస్పద ముద్ర తెచ్చుకున్నారు కొడాలి నాని. 2024 ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత నియోజకవర్గానికి దూరమయ్యారు. అలా అనారోగ్యం బారిన పడ్డారు. అయితే ఇంతవరకు గుడివాడ నియోజకవర్గంలో యాక్టివ్ కాలేదు. అలాగని ప్రత్యామ్నాయ నేతను జగన్మోహన్ రెడ్డి నియమించలేదు. కొడాలి నాని విషయంలో వేరే ఆలోచన చేస్తే చెడ్డ పేరు రావడం ఖాయం. అందుకే కొడాలి నాని కోసం జగన్ సైతం ఎదురుచూస్తున్నట్లు అర్థమవుతోంది.మరోవైపు అనూహ్యంగా ఎమ్మెల్యేగా గెలిచారు వల్లభనేని వంశీ మోహన్. 2009 ఎన్నికల్లో విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2014లో మాత్రం గన్నవరం నుంచి పోటీ చేసి గెలిచారు అసెంబ్లీకి. ఐదేళ్లపాటు చంద్రబాబు నాయకత్వం పట్ల విధేయత గా ఉండేవారు. 2019లో రెండోసారి టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. అది మొదలు చంద్రబాబుతో పాటు లోకేష్ ను టార్గెట్ చేసుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసుల్లో చిక్కుకున్నారు. చాలా రోజులపాటు జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. ఈ క్రమంలో ఆయన అనారోగ్యానికి గురయ్యారు. ఇప్పటికీ వంశి నియోజకవర్గంలో యాక్టివ్ కాలేదు. అలాగని ప్రత్యామ్నాయ నేతకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించలేదు జగన్మోహన్ రెడ్డి.అయితే ఈ రెండు చోట్ల టిడిపి కూటమి పట్టు బిగిస్తోంది. రెండు చోట్ల టిడిపికి బలమైన ఎమ్మెల్యేలు ఉన్నారు. దూకుడు ప్రదర్శిస్తున్నారు. వీరి పనితీరు బాగున్నట్లు కూడా నివేదికలు వస్తున్నాయి. వచ్చే ఎన్నికల్లో మరోసారి వీరిద్దరే పోటీ చేయనున్నారు. అందుకే ఈ రెండు నియోజకవర్గాల విషయంలో జగన్మోహన్ రెడ్డి మల్ల గుల్లాలు పడుతున్నారు. వారిని తప్పిస్తే చెడ్డ పేరు వస్తుంది. అలాగని వారు యాక్టివ్ కావడం లేదు. ఈ విషయంలో ఏం చేయాలో జగన్మోహన్ రెడ్డికి పాలు పోవడం లేదని వైసీపీలో ప్రచారం నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# వేగంగా కాశీబుగ్గ ఫ్లైఓవర్ పనులు

శ్రీకాకుళం, ఫిబ్రవరి 18 శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులలో వేగం పెరిగింది. కాశీబుగ్గ పైవంతెన పనులను ఏప్రిల్ నెలకల్లా పూర్తిచేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. మంగళవారం రోజున ఫ్లైఓవర్ నిర్మాణ పనులను రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. అనంతరం పలాస ఆర్వోబీ పనులు, కేంద్రీయ విద్యాలయం పనుల పురోగతిని రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. ఈ వివరాలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు.ఏపీలో కొత్త ఫ్లైఓవర్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. కాశీబుగ్గ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్ ఏప్రిల్ నాటికి పూర్తవుతాయని వెల్లడించారు. పలాస రైల్వే పైవంతెన, కేంద్రీయ విద్యాలయం పనులు జరుగుతున్న తీరును రామ్మోహన్ నాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి రామ్మోహన్ నాయుడు.. కాశీబుగ్గ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ఏళ్లతరబడి సాగుతూ వచ్చాయన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కేంద్రీయ విద్యాలయంలోనూ వచ్చే ఏడాది నుంచి తాత్కాలికంగా తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.పలాస ప్రజల ఎన్నో ఏళ్ల కల అయిన పలాస ఆర్వోబీ ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకోవడం ఆనందంగా ఉందని.. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దీనికి అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను కూడా తిరిగి ప్రారంభించామని.. భారతీయ రైల్వే, జిల్లా యంత్రాంగం సమన్వయంతో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని రామ్మోహన్ నాయుడు వివరించారు. ప్రజలకు త్వరగా అందుబాటులోకి రావడానికి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పలసా ఆర్వోబీ నిర్మాణం పూర్తి అయితే పలాస పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రయాణికులకు సౌకర్యవంతమైన రాకపోకలకు వీలు కలుగుతుందని వివరించారు. పలాసలో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ విద్యాలయం ద్వారా సాయుధ దళాల సిబ్బంది, కేంద్ర సంస్థల ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు లభిస్తాయని వివరించారు.మరోవైపు కాశీబుగ్గ లెవల్ క్రాసింగ్ గేటు వద్ద ట్రాఫిక్ సమస్యలు ఎప్పటి నుంచో వేధిస్తున్నాయి. ప్రతి పది అరగంటకూ గేట్లు పడుతూ ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించాలని నిర్ణయించారు. 2009లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే వివిధ కారణాలతో నిర్మాణ పనులకు అంతరాయం కలుగుతూ వచ్చింది. భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం వంటి అంశాల కారణంగా నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఈ పరిస్థితులలో టీడీపీ కూటమి సర్కారు ప్రత్యేక దృష్టి సారించడంతో నిర్మాణ పనులలో వేగం పెరిగింది. తాజాగా ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు

# 26న మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు

ఏలూరు, ఫిబ్రవరి 18,ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు, ఏలూరు నగరపాలక సంస్థల్లో ఖాళీగా ఉన్న మేయర్, డిప్యూటీ మేయర్ పదవుల భర్తీకి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 26వ తేదీన ఈ కీలక స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ మేరకు ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఎన్నికల నిర్వహణలో భాగంగా పారదర్శకతను పాటించాలని, సంబంధిత పాలకవర్గ సభ్యులకు, ఎక్స్ అఫీషియో సభ్యులకు ఈ నెల 20వ తేదీలోగా సమాచారం అందజేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియకు సంబంధించి నెల్లూరు, ఏలూరు జిల్లాల కలెక్టర్లకు, ఆయా నగరపాలక సంస్థల కమిషనర్లకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలను పంపిందినిర్ణీత షెడ్యూల్ ప్రకారం, ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒకవేళ అనివార్య కారణాల వల్ల లేదా ఏవైనా ఇతర ఇబ్బందుల వల్ల ఆ రోజు సమావేశం నిర్వహించలేని పరిస్థితి తలెత్తితే, మరుసటి రోజు అంటే 27వ తేదీన తప్పనిసరిగా సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొన్నారుఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి ఒక కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ల అమలును సుసాధ్యం చేసేలా, బీసీల జనాభాపై లోతైన అధ్యయనం చేయడానికి ఒక డెడికేటెడ్ కమిషన్‌ను ప్రభుత్వం నియమించనుంది. దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు నేడు లేదా రేపు వెలువడే అవకాశం ఉంది. ఈ మేరకు ఏకసభ్య కమిషన్‌ను నియమించే ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆమోదముద్ర వేశారు.రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాను ఈ డెడికేటెడ్ కమిషన్‌గా నియమించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రిజర్వేషన్ల ఖరారుకు అవసరమైన అధ్యయనాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం ఈ కమిషన్‌కు 30 నుంచి 45 రోజుల గడువును ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా బీసీల వెనుకబాటుతనాన్ని ఈ కమిషన్ క్షుణ్ణంగా పరిశీలించనుంది. ఈ అధ్యయనం కోసం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామ మరియు స్వర్ణ వార్డు సచివాలయాల సిబ్బంది నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే) డేటాను కమిషన్ ప్రామాణికంగా తీసుకోనుంది. ఈ సర్వే ద్వారా సేకరించిన గణాంకాలను విశ్లేషించి, రిజర్వేషన్ల అమలుపై కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది

# బెజవాడ కార్పొరేషన్ పై ఆశకిరణ్ గురి


విజయవాడ, ఫిబ్రవరి 18, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి కాస్త ప్రత్యేక స్థానం ఉంటుంది. దివంగత వంగవీటి రంగా రాజకీయ వారసత్వం పై ఎప్పుడు ఏదో ఒక చర్చ మనం చూస్తూనే ఉంటాం. వంగవీటి రంగా కుమారుడు వంగవీటి రాధా రాజకీయాల్లో ఉన్నప్పటికీ, ఆయన పెద్దగా యాక్టివ్ గా లేరు.. అనే ఆవేదన రంగ అభిమానుల్లో కనపడుతూ ఉంటుంది. ఇక ఇప్పుడు రంగా కుటుంబం నుంచి ఆయన కుమార్తె ఆశ కిరణ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఏ పార్టీలో చేరకపోయినప్పటికీ, ప్రజల్లో ఉంటానంటూ ఆమె చేసిన ప్రకటనలపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగింది. ఆమెకు తెలుగుదేశం( పార్టీ లేదా జనసేన పార్టీలు ఆహ్వానం పలుకుతున్నాయని వార్తలు కూడా వచ్చాయి.అయితే ఇప్పుడు మరో వార్త బెజవాడ రాజకీయాల్లో సంచలనంగా మారింది. వంగవీటి ఆశ కిరణ్, విజయవాడ మేయర్ అయ్యే అవకాశాలు ఉండొచ్చు ప్రచారం మొదలైంది. గత కార్పొరేషన్ ఎన్నికల్లో మహిళను అప్పటి వైసిపి ప్రభుత్వం మేయర్ గా ఎంపిక చేసింది. ఇప్పుడు అదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, కూటమి కూడా మహిళా నాయకురాలిని మేయర్ గా ఎంపిక చేసే అవకాశం ఉండవచ్చు. త్వరలోనే ఆమె జనసేన లేదా టిడిపిలో జాయిన్ అయ్యే అవకాశం ఉండవచ్చని.. ఈ ఏడాది చివర్లో జరగబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఆమె కార్పొరేటర్ గా నిలబడే అవకాశాలు ఉండవచ్చును అంటూ హడావుడి మొదలైందికాపు సామాజిక వర్గ ఓటు బ్యాంకు చీలకుండా, కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుంది. జనసేన రూపంలో మెజారిటీ కాపు సామాజిక వర్గం కూటమి వైపు ఉండగా.. వంగవీటి కుటుంబం ద్వారా కొంత కాపు సామాజిక వర్గాన్ని తమ వైపుకు తిప్పుకోవాలని వైయస్ జగన్ భావిస్తున్నారు. అందుకే ఇప్పుడు వంగవీటి ఆశా కిరణ్ ద్వారా.. కాపు సామాజిక వర్గంలో చీలిక తీసుకురాకుండా ఉండే దిశగా అడుగులు పడుతున్నాయి. త్వరలోనే వంగవీటి రాధకు ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ ఇచ్చే అవకాశం కూడా ఉంది. ఇక ఇదే సమయంలో వంగవీటి రంగా కుమార్తెకు కూడా విజయవాడ మేయర్ పదవిని ఖరారు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండకపోవచ్చు.

# రాజోలులో రగులుతున్న జ్వాల

కాకినాడ ఫిబ్రవరి 18, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు అనగానే ఓ ప్రత్యేకత ఉంటుంది. జనసేన పార్టీ నుంచి వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యే గెలిచిన నియోజకవర్గం అది. అదికూడా జనసేన పార్టీకి మొట్టమొదటి ఎమ్మెల్యేను గెలిపించి శుభారంభం ఇచ్చిన నియోజకవర్గం. ఈ నియోజకవర్గం అందుకే అంత ప్రత్యేకం. ఇదే విషయాన్ని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా చాలా సందర్భాల్లో ప్రస్తావించారు. రాజోలు ఒక చిరుదివ్వె లాంటిదని కూడా ఆయన ఎంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే ఈ నియోజకవర్గంలో మాత్రం జనసేన ఎమ్మెల్యే పనితీరుపై ఆ పార్టీలోనే అసంతృప్తి జ్వాలలు రేగుతోన్నాయా అన్న ప్రశ్నకు అవుననే సమాధానం ఆపార్టీ నాయకుల నుంచే వినిపిస్తోంది. ఇదిలా ఉంటే ఇదే నియోజకవర్గంలో టీడీపీ తన ఉనికిని కాపాడుకునేందుకు కూడా భారీ స్థాయిలో ప్రయత్నిస్తోంది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కుమార్తె గొల్లపల్లి అమూల్యను టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా నియమించింది. దీంతో రాజోలులో టీడీపీలో కొత్త జోష్ నెలకొంది. కూటమి ప్రభుత్వంలో ఏ కార్యక్రమానికైనా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు సమాచారం ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుంది. అయితే రాజోలు నియోజకవర్గంలో మాత్రం టీడీపీ ఇంచార్జ్‌గా ఉన్న అమూల్యకు చాలా ప్రభుత్వ కార్యక్రమాలకు అసలు సమాచారం ఇవ్వడం లేదన్నది ఆమె తన అనుచరుల వద్ద వాపోతున్నారట. ఇదే విషయాన్ని పార్టీ అధిష్టానానికి కూడా తెలిపినట్లు తెలుస్తోంది. నియోకవర్గాల్లో పలు నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ కూడా కనీస సమాచారం ఇవ్వకుండా తనకు నచ్చిన వారినే నియమించుకుంటున్నారని, వారి పార్టీ వరకు పరవాలేదు కానీ టీడీపీ నుంచి నియమించిన వారి విషయంలో కూడా తన వ్యతిరేకులకు కట్టబెట్టి తనకు వ్యతిరేక వర్గాన్ని పెంచి పోషిస్తున్నారని అమూల్య వాదనగా తెలుస్తోంది. ఉదాహరణకు ఇటీవలే ఇచ్చిన అంతర్వేది ఆలయ కమిటీ ఛైర్మన్ విషయంలోనూ ఇదే జరిగిందన్నది అమూల్య వర్గీయుల వాదనగా వినిపిస్తోంది. అంతర్వేది లక్ష్మి నరసింహస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ పదవిని టీడీపీ నేతకే ఇచ్చామని ఎమ్మెల్యే దేవవరప్రసాదరావు చెబుతున్నా ఈ సమాచారం తనకు చెప్పలేదని, తాను ప్రతిపాదించిన పేరు వేరే నాయకుడిది కాగా వారికి అనుకూలమైన వారికే పదవి కట్టబెట్టారన్నది అమూల్య మాటగా చెబుతున్నారు ఆమె అనుచరులు. ఇదే కాకుండా నియోజకవర్గంలో నియమించిన పలు నామినేటెడ్ పోస్టుల్లో టీడీపీకి ఇవ్వాల్సిన పదవుల్లో కూడా తన జోక్యం లేకుండా చేస్తున్నారని, నియోజకవర్గంలో అసలు ఒక ఇంచార్జ్ ఉన్నారన్న విషయాన్ని కూడా ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని అమూల్య బాధపడుతున్నట్టు తెలుస్తోంది.ప్రస్తుత పరిస్థితుల్లో జనసేన పార్టీ ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గాల్లో టీడీపీ అధిష్టానం కూడా జోక్యం చేసుకుంటున్న సందర్భాలు చాలా తక్కువనే చెబుతున్నారు విశ్లేషకులు. ఇదే విషయం రాజోలు నియోజకవర్గంలో కూడా వర్తిస్తుందంటున్నారు. అందులోనూ జనసేన అధినేతకు రాజోలు నియోజకవర్గం అంటే మరింత ప్రత్యేకం కాగా ఇక్కడ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తోన్న దేవ వరప్రసాదరావు మాజీ ఐఏఎస్ అధికారి కావడం, ఆయనకు అధినేతతో అత్యంత సాన్నిహిత్యం ఉండడం ఆయన మాటే వేదం అవుతుందంటున్నారు. ఈ పరిస్థితుల్లో అంతర్గతంగా జనసేన, టీడీపీ నేతల మధ్య అసంతృప్తి పరిస్థితులున్నా కూడా అవేమీ ఇరు పార్టీ నాయకత్వాలు పట్టించుకునే పరిస్థితి ఉండదని, లైట్ తీసుకుంటున్నాయంటున్నారు.ఇదిలా ఉంటే జనసేన పార్టీలోనే ఎమ్మెల్యేపై అసంతృప్తి జ్వాలలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఇప్పటికే రెండు వర్గాలుగా అంతర్గత యుద్ధాలే జరుగుతున్నాయి.. అవి ఎంతలా అంటే సోషల్ మీడియా వేదికగా కూడా ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకునేంత స్థాయిలో అంతర్గత విభేధాలు భగ్గుమంటుండగా కొందరైతే బాహాటంగా ఎమ్మెల్యే పనితీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. దీనికి తోడు ఇటీవల కాలంలో వైసీపీకకు చెందిన కొందరు జనసేన పార్టీలో దూరి ఎమ్మెల్యే అనుచరులుగా చక్రం తిప్పడం ముందు నుంచి పార్టీ జెండా మోసిన నాయకులు, కార్యకర్తలకు అసలు మింగుడు పడని అంశంగా మారింది. దీంతో ఎమ్మెల్యే తీరుపై కూడా కొందరు అధిష్టానానికి ఇప్పటికే ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీలో అంతర్గత పోరు విషయం ఇలా ఉంటే ఇక టీడీపీలో కూడా రెండు వర్గాలుగా మాటల యుద్ధం సాగుతోంది. ఇంచార్జ్ అమూల్యపై బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు ఆ పార్టీలోనే కొందరు నేతలు. అమూల్య ఒంటెద్దు పోకడలతో కొందరిని మాత్రమే వెంటేసుకుని వెళ్తున్నారని ఆరోపిస్తున్నారు. మొత్తం మీద రాజోలు నియోజకవర్గంలో అటు జనసేన, ఇటు టీడీపీలో అంతర్గత కోల్డ్ వార్ అయితే జరుగుతోందంటున్నారు.

# ఏపీలో మరో 9 ఎయిర్ పోర్టులు

అమరావతి, ఫిబ్రవరి 18, ఏపీ ప్రజలకు శుభవార్త. రాష్ట్రంలో మరిన్ని జిల్లాలకు విమాన కనెక్టివిటీ భవిష్యత్తులో ఏర్పడనుంది. దీని వల్ల రాష్ట్రంలోని ఏ మూలకైనా సులువుగా చేసుకోవచ్చు. అలాగే సరుకు రావాణా కూడా వేగంగా జరుగుతుంది. ఈ మేరకు తొమ్మిది ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.ఏపీలోని కూటమి సర్కార్ ప్రజా రవాణా, సరకు రవాణాను రాష్ట్రంలో మెరుగుపర్చేందుకు ప్రయత్నిస్తోంది. ప్రయాణాన్ని వేగవంతం చేయడం, సరుకు రవాణాలో వేగం పెంచేందుకు ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి శ్రీకారం చుడుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరు ఎయిర్‌పోర్ట్‌లు ఉండగా.. ఈ ఏడాదిలో మరో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తుంది. దీంతో మొత్తం ఏడు ఎయిర్‌పోర్ట్‌లు ఉండనున్నాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు విమాన కనెక్టివిటీని తెచ్చేందుకు మరో 9 ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్ర సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ మేరకు ప్లాన్లు రూపొందిస్తోంది. ఇందుకోసం రూ.6,417 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది.ఏపీలో మరో 9 కొత్త ఎయిర్‌పోర్ట్‌లకు ప్రణాళికలు రూపొందించారు. వీటి కోసం రూ.6,417 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వంతో భాగస్వామ్యమై వీటిని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, తిరుపతి, కర్నూలు, కడపలో విమానాశ్రయాలు అందుబాటులో ఉండగా.. మరికొద్ది నెలల్లో భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో వీటిని నిర్మించేందుకు ప్లాన్ రూపొందించింది. ఇవి అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోని ఎక్కడినుంచి ఎక్కడికైనా వెంటనే చేసుకోవచ్చు. దీని వల్ల సరుకు రవాణా పెరిగే స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.



ఎక్కడెక్కడంటే..?-నెల్లూరు జిల్లా దగదర్తి దగ్గర ఎయిర్‌పోర్ట్ నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.916 కోట్లు అవసరమవుతుందని అంచనా వేశారు. ఇప్పటికే భూసేకరణ పనులు కూడా మొదలయ్యాయి. త్వరలోనే టెండర్లను పిలిచి పనులు ప్రారంభించనున్నారు.

-చిత్తూరు జల్లా కుప్పంలో ఎయిర్‌పోర్ట్ కోసం 444 ఎకరాల భూమిని సేకరించనున్నాయి. ఈ విమనాశ్రయం నిర్మాణానికి రూ.1,142 కోట్లు అవసరమవుతాయని-రాజధాని అమరావతి, శ్రీకాకుళంలో ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణానికి ప్లాన్ వేశారు. అమరావతి ఎయిర్‌పోర్ట్‌కు రూ.వెయ్యి కోట్లు, శ్రీకాకుళంలో విమానాశ్రయ నిర్మాణానికి రూ.650 కోట్ల వ్యయం అవ్వనుంది.-కాకినాడ జిల్లా తుని-అన్నవరం మధ్య, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం, పల్నాడు జిల్లాలోని నాగార్జున సాగర్, ప్రకాశం జిల్లా ఒంగోలు, అనంతపురం జిల్లాల్లో ఎయిర్‌పోర్టుల నిర్మాణం కోసం డీపీఆర్ రెడీ చేస్తున్నారు.కొత్త పరిశ్రమలు వచ్చే అవకాశంఎయిర్‌పోర్టులు అందుబాటులోకి వస్తే స్దానికంగా కొత్త పరిశ్రమలు ఏర్పాటు అవుతాయి. దీంతో వల్ల చెన్నై, బెంగళూరుకు ఇక్కడ నుంచి వేగంగా సరుకు రవాణా జరుగుతుంది. దీని వల్ల లాజిస్టిక్స్ బిజినెస్ పెరుగుతోంది. కొత్త ఉద్యోగులు కూడా దీని ద్వారా ఏర్పడతాయి. స్థానిక యువతకు దీని వల్ల లాభం జరుగుతుందని ప్రభుత్వం చెబుతోంది.

# నెయ్యి టెండర్లలలో కొత్త పద్ధతికి శ్రీకారం

తిరుమల, ఫిబ్రవరి 18, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించే ఆవు నెయ్యి కొనుగోలు ప్రక్రియలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. లడ్డూ నాణ్యత, స్వచ్ఛత విషయంలో భక్తుల నమ్మకాన్ని నిలబెట్టేలా, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఛైర్మన్ బీఆర్ నాయుడు నేతృత్వంలోని నూతన టీటీడీ బోర్డు ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకుంది.గతంలో, అంటే 2024కు ముందు, శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచిపై భక్తుల నుంచి కొన్ని విమర్శలు, అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో స్పందించిన టీటీడీ, నెయ్యి కొనుగోలు విధానాన్ని సమూలంగా మార్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పలు కఠిన నిబంధనలను ప్రవేశపెట్టింది. నెయ్యి నాణ్యత రవాణా సమయంలో దెబ్బతినకుండా ఉండేందుకు, సేకరణ భౌగోళిక పరిధిని గతంలో ఉన్న 1500 కిలోమీటర్ల నుంచి 800 కిలోమీటర్లకు తగ్గించారు. నెయ్యిని సరఫరా చేసే ట్యాంకర్లకు తప్పనిసరిగా జీపీఎస్ లాక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి, రవాణాను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు.నాణ్యత పరీక్షల విషయంలోనూ రాజీపడకుండా కఠిన ప్రమాణాలను నిర్దేశించారు. డైరీల తయారీ సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఓఖీఒ స్కోర్ బోర్డ్ విధానాన్ని, ఈూాఖీ 2.1.8 నిబంధనలతో పాటు మిల్క్ ఫ్యాట్ ప్యూరిటీ పరీక్షలు (ఎూ 17678:2019), సెన్సరీ పారామిటర్స్ (ఎూ అనీటవ: 7770:1975) వంటివి తప్పనిసరి చేశారు.

ఈ సంస్కరణల్లో భాగంగా, 2024-25 సంవత్సరానికి గాను గుత్తాధిపత్యానికి తావివ్వకుండా మొత్తం 65 లక్షల కిలోల నెయ్యి సేకరణకు 7 విడతలుగా టెండర్లను నిర్వహించారు.

ఈ పారదర్శక ప్రక్రియలో 7 ప్రముఖ డైరీ సంస్థలు పాల్గొనగా, వాటికి దక్కిన టెండర్ల వివరాలు ఇలా ఉన్నాయి:

1. నందిని (ఐఓఈ) - 4 టెండర్లు దక్కించుకుంది
2. మదర్ డైరీ - 2 టెండర్లు దక్కించుకుంది
3. ఇందాపూర్ డైరీ - 2 టెండర్లు దక్కించుకుంది
4. సంగం డైరీ - 1 టెండర్ దక్కించుకుంది
5. ప్రీమియర్ అగ్రి డైరీ - టెండర్ దక్కించుకోలేదు
6. కొల్హాపూర్ డైరీ (గోకుల్) - టెండర్ దక్కించుకోలేదు
7. గోవింద్ మిల్క్ - టెండర్ దక్కించుకోలేదు

# బ్లాక్ రైస్‌తో బోలేడు లాభాలు.. అస్సలు ప్రయోజనాలు తెలిస్తే వదిలిపెట్టరు




బ్లాక్ రైస్, ఎమ్పెరర్ రైస్ లేదా ఫార్బిడెన్ రైస్గా కూడా పిలవబడుతుంది. ఇది అధిక పోషకాలతో నిండిన ప్రత్యేకమైన రకం రైస్. ఈ రైస్ లో ఉన్న విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్ల శక్తి దానిని "సూపర్ ఫుడ్"గా నిలబెడుతుంది. చరిత్రలో దీన్ని చైనా రాజవంశానికి మాత్రమే అందుబాటులో ఉండే రైస్‌గా గుర్తించారు, అందుకే దీన్ని "నిషేధిత రైస్" అని కూడా పిలిచారు. ఆరోగ్య ప్రయోజనాలు యాంటీఆక్సిడెంట్ల శక్తి బ్లాక్ రైస్ లో ఆంథోసైనిన్ అనే రసాయనం అధికంగా ఉంటుంది, ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. ఇది కేన్సర్, గుండె జబ్బులు వంటి సమస్యల నుండి రక్షణ కల్పిస్తుంది. ఆంథోసైనిన్లు వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో, కణజాలాల రక్షణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. బ్లాక్ రైస్ లో ఐరన్, విటమిన్ ఇ, జింక్ వంటి ఖనిజాలు , విటమిన్లు అధికంగా ఉంటాయి. ఇవి రక్తనిర్మాణంలో, చర్మ ఆరోగ్యంలో, ఇమ్యూన్ సిస్టమ్ బలపరిచే పనిలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ ఆహారాలతో నిద్రలేమి సమస్యకు చెక్.. హాయిగా నిద్రపోండి!!" హృదయ ఆరోగ్యం బ్లాక్ రైస్ లో అధికంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు గుండెకు మేలు చేస్తాయి. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండె నాళాల్లో కాషాయాలను తగ్గిస్తుంది. తద్వారా గుండె సంబంధిత సమస్యల ముప్పును తగ్గిస్తుంది. డయాబెటిస్ నియంత్రణ బ్లాక్ రైస్ లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. దీనిలో ఉన్న అధిక ఫైబర్ కారణంగా రక్తంలో గ్లూకోజ్ అంతటా సమానంగా విడుదలవుతుంది. "అటుకులతో చేసిన ఆహారం తింటున్నారా?" బరువు తగ్గించడంలో సహాయపడుతుంది బ్లాక్ రైస్ లో అధికమైన డైట్ ఫైబర్ కారణంగా దీనిని తినడం వల్ల ఎక్కువసేపు తృప్తిగా ఉంటుంది. ఇది ఆకలిని నియంత్రించడంలో మరియు బరువు తగ్గడంలో సహాయపడుతుంది. బ్లాక్ రైస్‌లోని ఆంథోసైనిన్ మిశ్రమాలు చర్మానికి మేలు చేస్తాయి. బ్లాక్ రైస్ ను ఆహారంలో చేర్చడం వృద్ధాప్య ఛాయలను తగ్గించి చర్మానికి అందాన్ని అందిస్తుంది. పవన్ కళ్యాణ్ వన్ మాన్ షో.! 5గురు కేంద్రమంతులతో పాటు ఎంపీను కలుస్తున్న లివర్ డిటాక్సిఫికేషన్ బ్లాక్ రైస్ లో యాంటీఆక్సిడెంట్లు మరియు పోషకాలు ఉన్నందున ఇది లివర్‌ను డిటాక్స్‌ఫై చేస్తుంది. ఇది హానికరమైన టాక్సిన్లను తొలగించి లివర్ పనితీరును మెరుగ ుపరుస్తుంది. అంతే కాకుండా దీని యాంటీఆక్సిడెంట్ శక్తి కణజాల రక్షణకు సహాయ పడుతుంది. కేన్సర్ కణాల పెరుగ ుదలను నిరోధిం చడంలో సహాయ ుకంగా ఉంటుంది. బ్లాక్ రైస్ ను పులావు, సలాడ్, లేదా డ్రింక్స్ రూపంలో ఉపయోగి ంచవ చ్చు. ఇది సాధారణ రైస్ కంటే ఎక్కువ సమయం ఉడకడానికి పడుతుంది, కానీ దాని పోష కవిలువ దీనిని ప్రత్యేకంగా నిలబె డుతుంది. బ్లాక్ రైస్ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అనుస రించాల నుకునే వారందరికీ అనువైన ఆహారం. ఇది కేవలం రుచి మాత్ర మే కాదు. అనేక ఆరోగ్య ప్రయో జనాలను కూడా అందిస్తుంది. రోజువారీ ఆహారంలో దీన్ని చేర్చడం ద్వారా ఆరోగ్యాన్ని బలప రుచు కోవచ్చు.

# ఉదయాన్నే మొలకలు తింటే ఏం జరుగుతుందో తెలుసా..?




మొలకలలో విటమిన్ సి, ఫైబర్, జింక్, ఇనుము, కాల్షియం, ఫోలెట్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. మొలకల్లో ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలు తగ్గి జీర్ణక్రియ పనితీరు మెరుగుపడుతుందంటున్నారు నిపుణులు. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారికి మొలకలు చాలా సహాయపడతాయంటున్నారు.ఉదయం మొలకలు తినడం అనేది ఆరోగ్యకరమైన అలవాటు. మొలకలు పోషకాల గని. వీటిని ఉదయం తినడం వల్ల మన శరీరానికి అనేక ప్రయోజనాలు కలుగుతాయి. మొలకలు తినడం వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలు: మొలకలు కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు మరియు ఫైబర్‌తో నిండి ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తాయి. ఉదయం మొలకలు తినడం వల్ల మనం రోజంతా చురుగ్గా ఉంటాము.మొలకల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, మలబద్ధకం నివారిస్తుంది. మొలకల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి, వ్యాధుల నుండి రక్షిస్తాయి. "ప్రతిరోజూ గుడ్డు తింటే గుండె ఆరోగ్యానికి మంచిదా? చెడ్డదా?." మొలకలు తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ ఆహారం. ఇవి ఎక్కువసేపు పొట్ట నిండిన అనుభూతిని కలిగిస్తాయి. దీంతో మనం అనవసరంగా తినడం నివారిస్తాయి.మొలకల్లో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మంచివి. రక్తపోటును తగ్గిస్తాయి, రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి.మొలకల్లో యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని స్వేచ్ఛా రాశుల నుండి రక్షిస్తాయి. ఇవి ముడతలు పడకుండా నిరోధిస్తాయి, చర్మాన్ని మృదువుగా చేస్తాయి. ఏ రకమైన మొలకలు తినాలి? పెద్ద వరి మొలకలు: ఇవి ప్రోటీన్, ఫైబర్‌కు మంచి మూలం. కంది మొలకలు: ఇవి ఐరన్, కాల్షియంకు మంచి మూలం. మినప మొలకలు: ఇవి విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్‌కు మంచి మూలం. ఎలా తినాలి? సలాడ్‌లలో: మొలకలను సలాడ్‌లలో వేసుకొని తినవచ్చు. సూప్‌లలో: సూప్‌లలో వేసుకొని తినవచ్చు. స్మూతీలలో: స్మూతీలలో వేసుకొని తినవచ్చు. సాంబార్‌లో: సాంబార్‌లో వేసుకొని తినవచ్చు. " చికెన్ పచ్చడి తింటున్నారా..?! 5గురు కేంద్రమంతులతో పాటు ఎంపీను కలుస్తున్న ు ముఖ్యమైన విషయం: మొలకలను శుభ్రంగా కడిగి, తగినంత నీరు పోసి, చీకటి ప్రదేశంలో వేసి మొలకలు వేయాలి. మొలకలు వేసిన తర్వాత వాటిని రోజుకు రెండుసార్లు కడిగి, తడి లేకుండా వేయాలి. ముగింపు: మొలకలు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వీటిని తరచూ తినడం ద్వారా మనం ఆరోగ్యంగా ఉండవచ్చు.

# బ్రష్ చేసిన వెంటనే టిఫిన్ తింటున్నారా? ఇది దంతాలను దెబ్బతీస్తుందా?



బ్రష్ చేసిన వెంటనే టిఫిన్ తినడం సాంప్రదాయంగా చాలా మందికి అనవాయితీ. అయితే దంతాలు తోమకు న్న వెంటనే ఆహారం తీసు కోవడం సరైనదేనా? తింటే ఏమవుతుంది.ఇది తరచుగా మనం ఎదుర్కొనే ప్రశ్న. దీనిపై వైజ్ఞానిక అభిప్రాయం ,ఆరోగ్య దృష్టిలో కొన్ని ముఖ్యమైన అంశాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. దంత నిపుణుల అభిప్రాయం ప్రకారం, టిఫిన్ తినడానికి ముందు బ్రష్ చేయడం మంచి అలవాటు. ఇది నోటి శుభ్రతను మెరుగుపరుస్తుంది, అయితే టిఫిన్ తినడంలో కొంత విరామం పెట్టడం మంచిది. దంతాలను తోముకోవడం ఎందుకు ముఖ్యం? ప్లాక్ తొలగించడం: దంతాలపై పేరుకుపోయే ఆహారపు అవశేషాలు, బ్యాక్టీరియా కలిసి ప్లాక్ అనే పొరను ఏర్పరుస్తాయి. ఈ ప్లాక్ దంతాల ఎనామెల్‌ను దెబ్బతీసి, క్యావిటీలకు కారణమవుతుంది. బ్రష్ చేయడం ద్వారా ఈ ప్లాక్‌ను తొల గించి, దంతాలను రక్షిస్తాయి. బ్యాక్టీరియా ప్లాక్‌లో పెరిగి, దంత క్షయం, చిగుళ్ల వ్యాధులకు కారణ మవుతాయి. కనుక బ్రష్ చేయడం ద్వారా ఈ బ్యాక్టీరియాను తొలగి ంచి, నోటి ఆరోగ్యాన్ని కాపాడుక ుంటాము. "ఖాళీ కడుపుతో ఈ ఒక్క జ్యూస్ తాగితే చాలు.. ఫ్యాట్ మొత్తం కరిగిపోవాల్సిందే!" బ్రష్ చేసిన వెంటనే ఆహారం తీసుకో వడం వల్ల కలిగే ప్రభావాలు: ఎనామెల్ ఎరోషన్: దంతాల ఎనామెల్ ఒక రకమైన మినరల్. బ్రష్ చేసిన వెంటనే ఆహారం తీసుకుంటే, ఎనామెల్ సున్నితంగా మారి, ఆహారంలోని ఆమ్లాలు దానిని దెబ్బతీస్తాయి. దీని వల్ల దంతాలు పసుపు రంగులోకి మారి, సున్నితంగా మారతాయి. బ్రష్ చేసిన తర్వాత వెంటనే ఆహారం తీసుకుంటే, మళ్ళీ ప్లాక్ ఏర్పడే ప్రమాదం ఉంటుంది. బ్రష్ చేయడం వల్ల కలిగే ప్రయోజనం తగ్గిపోతుంది. ఎనామెల్ దెబ్బతినడం వల్ల దంతాలు చల్లని, వేడి ఆహారాలకు సున్నితంగా మారతాయి. "పొద్దుతిరుగుడు గింజల్లో దాగున్న ఆరోగ్య రహస్యాలు!' పవన్ కళ్యాణ్ వన్ మాన్ షో.! 5గురు కేంద్రమంతులతో పాటు ఎంపీను కలుస్తున్న జీర్ణవ్యవస్థపై ప్రభావం: బ్రష్ చేసిన వెంటనే టిఫిన్ తింటే నోటిలో సలైవా ఉత్పత్తి తగ్గి జీర్ణక్రియ కొంత నెమ్మదిగా జరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా, టిఫిన్‌లో ఉన్న కార్బోహైడ్రేట్లు సంపూర్ణంగా జీర్ణం కావడానికి సమయంపడుతుంది. అటు టూత్‌పేస్ట్‌లో ఉండే పదార్థాలు, ముఖ్యంగా ఫ్లోరైడ్, నోటి రుచిని తాత్కాలికంగా మార్చుతాయి. ఇది టిఫిన్‌లోని రుచులను ఆస్వాదించకుండా చేస్తుంది. బ్రష్ తర్వాత నోట్లో జూఉ స్థాయి: బ్రష్ చేసిన వెంటనే నోట్లోని జూఉ స్థాయి ఆల్కలైన్‌గా మారుతుంది. ఇది కొంతకాలం వరకు ఆహారాన్ని జీర్ణించడంలో అవరోధం కలిగించే అవకాశం ఉంటుంది. అందువల్ల, ఆహారం తినడం కొద్దిగా ఆలస్యం చేస్తే మంచిది. బ్రష్ చేసిన వెంటనే కాకుండా 10-15 నిమిషాల తర్వాత టిఫిన్ వంటి ఆహారాలు తినడం ఉత్తమం. ఈ సమయం గరిష్టమైన జీర్ణక్రియకు సహాయపడుతుంది. శక్తిని అందిస్తుంది. సరైన అలవాట్లు: బ్రష్ చేసిన తర్వాత సాదారణ నీటితో నోటిని శుభ్రం చేయండి. తర్వాత తగిన విరామం ఇచ్చి ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. టిఫిన్ తర్వాత మళ్లీ బ్రష్ చేయకపోయినా, నోటి శుభ్రత కోసం గార్గిల్ చేయడం ఉత్తమం. బ్రష్ చేసిన వెంటనే పుల్లటి పండ్లు, జ్యూస్‌లు, సోడా వంటి ఆమ్లత్వం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిది కాదు. అయితే, ఒకవేళ మీరు బ్రష్ చేసిన వెంటనే టిఫిన్ తినక తప్పకపోతే, కనీసం 30 నిమిషాల తర్వాత తినడం మంచిది.

# శీతాకాలంలో ఆకుకూరలు వీరికి డేంజర్... తెలుసుకోండి!

చాలామంది ఆకుకూరలను ఇష్టంగా తింటారు. ఆకుకూరలలో ఉండే పోషకాలు మన శరీరానికి ఆరోగ్యాన్ని ఇస్తాయని బలంగా నమ్ముతారు. ప్రతిరోజు ఆకుకూరలను తింటే ఆరోగ్యం అని కూడా చాలామంది భావిస్తూ ఉంటారు. అయితే ఆకుకూరలు తినడం మంచిది అయినప్పటికీ అతిగా ఆకుకూరలను తినడం ఏమాత్రం మంచిది కాదు. వర్షాకాలంలోనూ, శీతాకాలంలోనూ కొన్ని రకాల ఆకుకూరలను తినడం కొన్ని అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ఇబ్బంది కలిగిస్తుంది. ఆకుకూరలతో ఆరోగ్యం ఒకరకంగా చెప్పాలంటే కొంతమందికి ఆకుకూరలు ఎక్కువగా తినడం విషంతో సమానం అని చెప్పొచ్చు. ఇక శీతాకాలంలో ఎవరు ఎక్కువగా ఆకుకూరలు తినకూడదు? తినడం వల్ల ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది? అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. ఆకుకూరలు నిస్సందేహంగా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ప్రతిరోజు ఏదో ఒక ఆకుకూరను ఆహారంగా తీసుకుంటే ఉత్సాహంగా ఉండేందుకు దోహదం చేస్తుంది. "తల స్నానానికి ముందు జుట్టుకు నూనె రాస్తున్నారా? ఇది మంచిదేనా?" ఆకు కూరలలో ఫుల్ పోషకాలు ఆరోగ్యం కోసం వేలు, లక్షలు ఖర్చు పెట్టేవారు ఆకుకూరలతో ఆహారాన్ని అలవాటు చేసుకుంటే ఆసుపత్రి ఖర్చులు కొంతవరకు తగ్గించవచ్చని వైద్యులు చెబుతారు. ఆకుకూరల్లో కొవ్వు పదార్థాలు తక్కువగా ఉండడం, ప్రోటీన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉండడం వంటి కారణాలతో అవి మన ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయని చెబుతారు. వీళ్ళు ఆకుకూరలు తినొద్దు అయితే ప్రస్తుతం శీతాకాలం కావడంతో మార్కెట్లో రకరకాల ఆకుకూరలు అందుబాటులోకి వచ్చాయి. అయితే ముఖ్యంగా కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఎక్కువ ఆకుకూరలను తినకూడదు. ముఖ్యంగా శీతాకాలంలో ఎక్కువ ఆకుకూరలు తినకూడని వారు ఎవరు అంటే.. గ్యాస్ సంబంధిత సమస్యలతో బాధపడేవారు ఆకుకూరలు ఎక్కువగా తినకూడదు. ఆకుకూరలలో ఎక్కువగా ఫోలేట్ ఉంటుంది ఇది గ్యాస్ సమస్యను మరింత తీవ్రతరం చేసి వారిని ఇబ్బందికి గురిచేస్తుంది.5గురు కేంద్రమంతులతో పాటు ఎంపీను కలుస్తున్న ఆఎ అఓ.. ఈ సమస్యలుంటే ఎక్కువ ఆకుకూరలు తినరాదు ఇక అలర్జీ సమస్యలతో బాధపడేవారు, గర్భిణీలు శీతాకాలంలో ఎక్కువ ఆకుకూరలను తినకూడదు. ఆకుకూరల్లో ఆక్సలేట్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇది అలర్జీ సమస్యను మరింత పెంచుతుంది. అంతేకాదు కీళ్ల నొప్పులతో బాధపడేవారు ఎక్కువ ఆకుకూరలను తినకూడదు. శీతాకాలంలో కీళ్ల నొప్పులు ఎక్కువ బాధిస్తాయి. అటువంటివారు ఆకుకూరలు తింటే ఆ సమస్య మరింత పెరుగుతుంది . "కాకరకాయతో కలిపి ఈ ఆహారాలు అస్సలు తినొద్దు.. ఎంత డేంజరంటే?" హై బీపీతో పాటు ఈ సమస్యలున్న వారు ఆకుకూరలు తినకండి కిడ్నీ సమస్యలతో బాధపడే వారు కూడా ఎక్కువ ఆకుకూరలను తినకుండా ఉంటేనే మంచిది. థైరాయిడ్ సమస్య ఉన్నవారు కూడా ఎక్కువ ఆకుకూరలకు దూరంగా ఉండాలి..అధిక రక్తపోటు సమస్య ఉన్నవారు ఆకుకూరలను ఎక్కువగా తినకూడదు. ఇది ప్రయోజనాన్ని చేకూర్చటానికి బదులు ఆరోగ్యానికి హాని చేస్తుంది. కాబట్టి ఈ సీజన్లో ఎక్కువ అక్కకూరలకు దూరంగా ఉండటం మంచిది



# మిరియాలు మన ఆరోగ్యానికి చేసే మేలు మరువతరమా!

మనం వంటల్లో ప్రతిరోజు మిరియాలు వాడుతూ ఉంటాం. మిరియాలు మనం ఉపయోగించే ముఖ్యమైన మసాలా దినుసులలో ఒకటి. ఇది మనం తినే ఆహారాలలో ఘటైన రుచిని ఇవ్వడంతో పాటు మనకు తెలియకుండానే మనకు ఎంతో ఆరోగ్యాన్ని కూడా ఇస్తుంది. మసాలా దినుసుల రారాజుగా చెప్పే మిరియాలను ప్రతిరోజు ఆహారంలో పరిమితంగా వినియోగిస్తే మిరియాలలో ఉండే ఔషధ గుణాలు మన ఆరోగ్యాన్ని కాపాడడానికి దోహదం చేస్తాయి. మిరియాలలో పోషకాలు మిరియాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మనకు ఎంతో బాగా ఉపయోగపడతాయి. మిరియాలలో బోలెడన్ని పోషకాలు ఉంటాయి. మిరియాలలో విటమిన్ సి, క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ కే, కాపర్, ఐరన్ మరియు మాంగనీస్ ఉంటాయి. మిరియాలలో సంతృప్త కొవ్వులు, కొలెస్ట్రాల్ మరియు సోడియం చాలా తక్కువగా ఉంటాయి. "పొట్లకాయ తిన్న తర్వాత తినకూడని ఆహారాలు.. పొరపాటున తిన్నారో..?" మిరియాలతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు మిరియాలను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. మిరియాలు మన జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. మిరియాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు మన శరీరానికి ఎంతో బాగా దోహదం చేస్తాయి. డయాబెటిస్ రాకుండా మిరియాలు మనలను కాపాడుతాయి. మిరియాలు మన పోషకాల శోషణ పెంచుతాయి. మిరియాలలో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. మిరియాలతో ఈ అనారోగ్య సమస్యలకు చెక్ నరాల సంబంధిత సమస్యలు ఉన్నవారు మిరియాలను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల ఆ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మిరియాలు మన రోగనిరోధక శక్తిని బాగా పెంచుతాయి. శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించడంతోపాటు మన బరువు తగ్గడానికి మిరియాలు ఎంతో బాగా దోహదం చేస్తాయి. గొంతు నొప్పి జలుబు, వైరల్ ఫీవర్ వంటి ఇబ్బందులతో బాధపడేవారు మిరియాలు ఆహారంలో భాగంగా తీసుకుంటే వాటి నుంచి ఉపశమనం లభిస్తుంది. మిరియాలతో కీళ్ళవాతం నుండి ఉపశమనం మిరియాలు యాంటీసెప్టిక్ గా ఉపయోగపడతాయి. ఆర్థరైటిస్ తో బాధపడే వారికి కూడా మిరియాలు, కీళ్లవాతం నుంచి ఉపశమనం పొందడానికి దోహదం చేస్తాయి. ఇక ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్న మిరియాలను ఆహారంలో భాగంగా చేసుకుంటే చాలా మంచిది. అయితే మిరియాలను మితంగానే తీసుకోవాలి అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలి.



# స్పోర్ట్స్ న్యూస్

## పాపం సూరీడి కల నెరవేరలేదు!

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీ ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించాలనే టీమిండియా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ కల కలగానే మిగిలిపోయింది. అహ్మదాబాద్ వేదికగా ఆస్ట్రేలియాను ఓడించి టైటిల్ గెలవాలని సూర్యకుమార్ యాదవ్ భావించాడు. తద్వారా వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. కానీ ఆస్ట్రేలియా అనూహ్యంగా లీగ్ దశలోనే ఈ టోర్నీ నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే.పసికూన జింబాబ్వేతో పాటు శ్రీలంక చేతిలో ఓడిన ఆస్ట్రేలియా.. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సూపర్-8 రేసు నుంచి తప్పుకుంది.



జింబాబ్వే, ఐర్లాండ్ వేదికగా మంగళవారం జరగాల్సిన మ్యాచ్ వర్షంతో తుడిచిపెట్టుకుపోయిన సంగతి తెలిసిందే. దాంతో జింబాబ్వే ఐదు, శ్రీలంక 6 పాయింట్లతో గ్రూప్-బీ నుంచి సూపర్-8 చేరాయి. దాంతో ఆసీస్ మెగా టోర్నీ నుంచి వైదొలగాల్సి వచ్చింది.ఈ టోర్నీ షెడ్యూల్ ప్రకటన కార్యక్రమంలో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, మహిళల వన్డే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో కలిసి సూర్యకుమార్ యాదవ్ పాల్గొన్నాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో ఫైనల్ ప్రత్యర్థిగా ఎవరు ఉండాలని అనుకుంటున్నారు? అని సూర్యకుమార్ యాదవ్‌ను హోస్ట్ జతిన్ సప్రు ప్రశ్నించాడు. అందుకు సూర్య.. 'అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ఆస్ట్రేలియాను ఓడించాలనుకుంటున్నాం.'అని నవ్వుతూ బదులిచ్చాడు.రోహిత్ శర్మ మాత్రం ఏ జట్టుతోనైనా పర్లేదని, కానీ భారత్ ఫైనల్ చేరాలని, విజేతగా నిలవాలని కోరుకుంటున్నానని తెలిపాడు. 'టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భారత్ ఫైనల్ చేరాలని కోరుకుంటున్నా. గతంలో జరిగిందేదో జరిగిపోయింది(వన్డే ప్రపంచకప్ ఓటమి). అదే స్టేడియంలో ఆస్ట్రేలియాను ఫైనల్లో ఓడించాలని సూర్య ఎంతో బాధతో చెప్పాడు. భారత్.. ఏ జట్టుతో ఫైనల్స్ ఆడినా.. విజేతగా చూడాలని కోరుకుంటున్నా.'అని ఇదే కార్యక్రమంలో రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు. ఆస్ట్రేలియా లీగ్ దశలోనే వెనుదిరగడంతో సూర్య వ్యాఖ్యలను ఫ్యాన్స్ గుర్తు చేసుకుంటున్నారు. పాపం సూరీడి కల నెరవేరలేదని కామెంట్ చేస్తున్నారు.

## అగ్రస్థానంలోనే కొనసాగుతున్న అభిషేక్ శర్మ.. మారని సూర్య స్థానం

మరోవైపు భారత యువ సెన్సేషన్ అభిషేక్ శర్మ తన నంబర్ 1 స్థానాన్ని పదిలం చేసుకున్నారు. గత కొన్ని ఇన్నింగ్స్‌ల్లో ఆశించిన స్థాయిలో రాణించకపోయినా.. తన వద్ద ఉన్న 891 రేటింగ్ పాయింట్లతో ప్రపంచ అత్యుత్తమ టీ20 బ్యాటర్‌గా అభిషేక్ శర్మ కొనసాగుతున్నాడు. ఇక టీ20 స్పెషలిస్ట్, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన నిలకడైన ప్రదర్శనతో 6వ స్థానంలో స్థిరంగా ఉండగా.. యువ ఆటగాడు తిలక్ వర్మ ఒక స్థానాన్ని మెరుగుపరుచుకుని 4వ ర్యాంకుకు చేరుకున్నాడు.



టాప్-10లో నలుగురు భారత బ్యాటర్లు ఉండటం టీమిండియా బ్యాటింగ్ బలానికి నిదర్శనం.తాజా ర్యాంకింగ్స్‌లో ఇతర దేశాల ఆటగాళ్లలో కూడా భారీ మార్పులు కనిపించాయి. ఇంగ్లండ్‌కు చెందిన ఫిల్ సాల్ట్ రెండో స్థానంలో కొనసాగుతుండగా.. టీ20 ప్రపంచకప్‌లో సెంచరీతో అదరగొట్టిన శ్రీలంక బ్యాటర్ పాతుమ్ నిస్సంకా మూడు స్థానాలు మెరుగుపరుచుకుని మూడో ర్యాంకును కైవసం చేసుకున్నాడు. పాకిస్థాన్ ఆటగాడు సాహిబ్‌జాదా ఫర్హాన్ 5వ స్థానంలో, ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ 7వ స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్ ట్రావిస్ హెడ్ మాత్రం 10వ స్థానానికి పడిపోయాడు.ఈ ర్యాంకింగ్స్ విశ్లేషిస్తే.. భారత క్రికెట్‌లో యువ ఆటగాళ్ల హవా స్పష్టంగా కనిపిస్తోంది. సీనియర్ల గైర్హాజరీలో కూడా అభిషేక్, తిలక్, ఇషాన్ వంటి యువకులు ప్రపంచ స్థాయి ర్యాంకుల్లో అగ్రస్థానంలో ఉండటం గమనార్హం. ముఖ్యంగా ఇషాన్ కిషన్ కనబరుస్తున్న దూకుడు రాబోయే మ్యాచ్‌ల్లో ఆయనను మరిన్ని మెరుగైన స్థానాలకు తీసుకెళ్లే అవకాశం ఉంది. ప్రపంచకప్ కీలక దశకు చేరుకుంటున్న తరుణంలో భారత బ్యాటర్లు ఇలాంటి ఫామ్‌లో ఉండటం జట్టుకు పెద్ద సానుకూలాంశం.ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-10 బ్యాటర్లు1. అభిషేక్ శర్మ2. ఫిల్ సాల్ట్3. పాతుమ్ నిస్సంకా4. తిలక్ వర్మ5. సాహిబ్జాదా ఫర్హాన్6. సూర్యకుమార్ యాదవ్7.జోస్ బట్లర్8.ఇషాన్ కిషన్
9. టిమ్ సీఫర్ట్10. ట్రావిస్ హెడ్

## గిన్నెలు కడిగాం.. కన్నీటి పర్యంతమైన పాక్ కెప్టెన్!

ఓవైపు పాకిస్థాన్ క్రికెట్ టీమ్ పేలవ ప్రదర్శనతో సతమతమవుతుంటే మరోవైపు ఆ దేశ హాకీ టీమ్ దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటుంది. ఆస్ట్రేలియా పర్యటనను ముగించుకొని స్వదేశానికి చేరిన పాకిస్థాన్ హాకీ టీమ్ కెప్టెన్ షకీల్ బట్ కన్నీటి పర్యంతమయ్యాడు.లాహోర్ విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడిన షకీల్ బట్.. ఆస్ట్రేలియా పర్యటనలో తీవ్ర అవమానాలు ఎదుర్కొన్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్ పాలనా వైఫల్యాలపై అసహనం వ్యక్తం చేశాడు.ఆస్ట్రేలియాలో వంటగదిని శుభ్రం చేయడంతో పాటు పాత్రలు కడగాల్సి వచ్చిందని చెప్పాడు. ఇలాంటి దయనీయమైన పరిస్థితుల్లో విజయాలు ఎలా సాధిస్తామని ప్రశ్నించాడు. ప్రస్తుత హాకీ పాలక వర్గంతో ముందుకు సాగలేమని స్పష్టం చేశాడు.ఆస్ట్రేలియా పర్యనటకు వెళ్లిన పాకిస్థాన్ హాకీ టీమ్‌కు సరైన వసతులు లభించలేదు. సిడ్నీ విమానాశ్రయంలో దిగిన పాక్ ఆటగాళ్లకు 13 గంటల పాటు ఆకలి, దప్పికలతో అలమటించారు. హోటల్‌కు వెళ్లగా.. ముందస్తు చెల్లింపులు జరగలేదని గదులు ఇచ్చేందుకు నిరాకరించారు. దాంతో పాక్ ఆటగాళ్లు ఆస్ట్రేలియా వీధుల్లో నిరాశ్రయులై తిరిగారు. అనంతరం వారికి బస లభించింది.ఈ ఘటన జరిగిన మరుసటి రోజే జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 3-2తో పాకిస్థాన్ చిత్తయ్యింది. ఆ తర్వాత జర్మనీతో జరిగిన మ్యాచ్‌లోనూ ఓటమిపాలైంది. పాకిస్థాన్ స్పోర్ట్స్ బోర్డు ఈ పర్యటన కోసం హాకీ ఫెడరేషన్‌కు సుమారు కోటి రూపాయలు వరకు కేటాయించింది. కానీ, నిధుల ఖర్చుపై అడ్మినిస్ట్రేషన్ స్పష్టత ఇవ్వలేదని షకీల్ బట్ తెలిపాడు. 13 రోజులు బస చేయాల్సిన చోట కేవలం 10 రోజులకే హోటల్ బుకింగ్ చేశారని, చివరి మూడు రోజులు చౌకైన హోటళ్లకు తరలించారని ఆరోపించాడు.ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన పాకిస్థాన్ ప్రధాని హెహబాజ్ షరీఫ్ సమగ్ర విచారణకు ఆదేశించారు. మీడియాతో మాట్లాడితే క్రమశిక్షణా చర్యల బెదిరింపులు ఉంటాయని తెలిసినా.. ఆస్ట్రేలియాలో పడ్డ అవమానాన్ని షకీల్ బట్ ధైర్యంగా బయటపెట్టాడు. ఆటగాళ్లు మైదానంలో చెమట కన్నా కన్నీళ్లే ఎక్కువగా చిందించారని ఈ ఘటన తేటతెల్లం చేసింది.క్రికెట్‌లో రాజకీయం చేస్తున్న పాకిస్థాన్ ప్రభుత్వం.. జాతీయ క్రీడ హాకీని నిర్లక్ష్యం చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. షకీల్ బట్ వ్యాఖ్యలు పాకిస్థాన్‌లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి.




## యూఏఈపై ఆరు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా విజయం




న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్ గ్రూప్ డీ మ్యాచ్‌లో ఇవాళ దక్షిణాఫ్రికా జట్టు ఆరు వికెట్ల తేడాతో యూఏఈపై విజయం సాధించింది. దీంతో తమ గ్రూపులోని అన్ని మ్యాచ్‌ల్లో దక్షిణాఫ్రికా విక్టరీ నమోదు చేసింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 122 రన్స్ చేసింది. టాపార్డర్‌లో అలీషాన్ షారఫూ అత్యధికంగా 45 రన్స్ చేశాడు. అయితే ఆ టార్గెట్‌ను కేవలం 13.2 ఓవర్లలో సఫారీలు అందుకున్నారు. దక్షిణాఫ్రికా బ్యాటర్ రికల్టన్ 16 బంతుల్లో 30 రన్స్ చేయగా, బ్రెవిస్ 25 బంతుల్లో 36 రన్స్ స్కోరు చేశారు. మరో 40 బంతులు మిగిలి ఉండగానే దక్షిణాఫ్రికా విజయ కేతనం ఎగురవేసింది. సఫారీ బౌలర్ కార్బిన్ బాష్ ఈ మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసుకున్నాడు. గ్రూపు డీ నుంచి ఇప్పటికే దక్షిణఫ్రికాతో పాటు న్యూజిలాండ్ .. సూపర్-8 స్టేజ్‌కు క్వాలిఫై అయ్యాయి.

## చరిత్ర సృష్టించిన జమ్మూకశ్మీర్.. బెంగాల్‌పై గెలుపుతో తొలిసారి రంజీ ట్రోఫీ ఫైనల్లోకి





టార్గెట్‌ను చేజ్ చేసి చరిత్ర సృష్టించింది. దీంతో రంజీ టోర్నమెంట్ చరిత్రలోనే తొలిసారి జమ్మూకశ్మీర్ ఫైనల్లోకి ఎంట్రీ ఇచ్చింది. జమ్మూకశ్మీర్ జట్టు విజయంలో అబ్దుల్ సమద్, అకీబ్ నబీ, వన్షాజ్ శర్మ కీలక పాత్ర పోషించారు. అబ్దుల్ సమ్ తొలి ఇన్నింగ్స్‌లో 82, రెండో ఇన్సింగ్‌లో 30 రన్స్ చేశాడు. నబీ ఈ మ్యాచ్‌లో మొత్తం 9 వికెట్లు తీసుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో శర్మ అజేయంగా 43 రన్స్ చేశాడు.హిమాలయ ప్రాంతానికి చెందిన ఓ జట్టు రంజీ ఫైనల్లోకి ప్రవేశించడం ఇదే మొదటిసారి. తొలుత టాస్ గెలిచి జమ్మూకశ్మీర్ ఫీల్డింగ్ ఎంచుకున్నది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో బెంగాల్ 328 రన్స్‌కు ఆలౌటైంది. సుదీప్ కుమార్ ఆ ఇన్నింగ్స్‌లో అత్యధికంగా 146 రన్స్ చేశాడు. ఇక జమ్మూకశ్మీర్ తన తొలి ఇన్నింగ్స్‌లో 302 పరుగులకే ఆలౌటైంది. 26 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బెంగాల్ కేవలం 99 పరుగులకే ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో జమ్మూకశ్మీర్‌కు మొత్తం 126 పరుగుల లక్ష్యాన్ని విసిరింది. అయితే ఆ టార్గెట్‌ను జమ్మూకశ్మీర్ 4 వికెట్లు కోల్పోయి అందుకున్నది. బెంగాల్ బౌలర్ మొహమ్మద్ షమీ ఈ మ్యాచ్‌లో మొత్తం 9 వికెట్లు తీసుకున్నాడు. అతను ఫస్ట్ ఇన్నింగ్స్‌లోనే ఏకంగా 8 వికెట్లు తీసుకున్న విషయం తెలిసిందే.

## యుఎఇపై ఘన విజయం సాధించిన సౌతాఫ్రికా

ఢిల్లీ: ఐసిసి టి-20 ప్రపంచకప్‌లో భాగంగా అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా యుఎఇతో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన యుఎఇ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. యుఎఇ బ్యాటింగ్‌లో అలిషాన్ షరాఫు (45) మినహా మిగితా వారందరూ స్వల్పస్కోర్‌కే పరిమితమయ్యారు. ఇక స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా 13.2 ఓవర్లలో 4 వికెట్లు టార్గెట్‌ని చేరుకుంది. దీంతో ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. సౌతాఫ్రికా బ్యాటింగ్‌లో డేవాల్డ్ బ్రెవిస్ 36, రియాన్ రికెల్టన్ 30, మార్క్‌రమ్ 28 పరుగులతో రాణించారు. బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన కార్బిన్ బాష్‌కి ప్లేయర్ అఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.







# 26న ఉదయ్‌పూర్‌లో రష్మిక, విజయ్‌ల పెళ్లి

## మార్చి4న హైదరాబాద్‌లో రిసెప్షన్ అంటూ ప్రచారం



టాలీవుడ్‌లో హిట్ ఫెయిర్ హీరో విజయ్ దేవరకొండ– హీరోయిన్ రష్మిక మందన్న పెళ్లి వార్తలు ఇప్పుడు మరింత జోరందుకున్నాయి. వీరు వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతోంది. ఫిబ్రవరి చివరి వారంలో వీరి పెళ్లి జరగనుందనే టాక్ ఇండస్ట్రీలో సెన్సేషన్ సృష్టిస్తోంది. రాజస్థాన్‌లోని అందమైన నగరం ఉదయ్‌పూర్ లోని ఓ రాయల్ ప్యాలెస్‌లో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య సింపుల్‌గా పెళ్లి వేడుక జరపాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 26 తేదీని ముహూర్తంగా ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది. ఈ వేడుకను గోప్యంగా ఉంచేందుకు ఎంత ప్రయత్నించినా సోషల్ మీడియాలో సమాచారం లీక్ అవుతూనే ఉండటం గమనార్హం. పెళ్లి వేడుక ఉదయ్‌పూర్‌లో సాదాసీదాగా జరిగినా, అసలు హంగామా మాత్రం హైదరాబాద్ లోనే ఉండబోతుందని టాక్. మార్చి 4న నగరంలోని ప్రముఖ వేదికలో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం భారీ రిసెప్షన్ నిర్వహించనున్నట్లు సమాచారం. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్ సెలబ్రిటీలు ఈ వేడుకకు హాజరవుతారని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల విజయ్ దేవరకొండ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ఆహ్వాన పత్రిక అందించారనే ప్రచారం ఈ పెళ్లి వార్తలకు మరింత బలం చేకూర్చింది. తాజాగా విజయ్ దేవరకొండ వెడ్డింగ్ కార్డ్ నెట్టింట వైరల్ అవుతుంది. ఇది చాలా




సింపుల్‌గా కనిపిస్తుంది. ఈ ఇన్విటేషన్ ప్రకారం వారి వివాహం ఫిబ్రవరి 26న వివాహవం జరగనుందని అర్థమవుతుంది. రష్మిక – విజయ్‌లతో కలిసి పని చేసిన దర్శకులు, టెక్నీషియన్లు, సన్నిహితులు కూడా ఈ వేడుకలో పాల్గొనే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సెలబ్రిటీ వెడ్డింగ్ రిసెప్షన్‌కు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు, స్టార్ హీరోలు హాజరవుతారనే అంచనాలు ఉన్నాయి.



# ఫౌజీ షూటింగ్‌లో ప్రభాస్‌కు గాయం





ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం ఫౌజీ షూటింగ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గుర్రపు స్వారీ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ప్రభాస్ కింద పడిపోవడంతో చేతులకు చిన్న గాయాలు అయినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. చిత్ర బృందం వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించగా, గాయాలు తీవ్రంగా లేవని తెలిసింది. వైద్యులు ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం ప్రభాస్ సురక్షితంగానే ఉన్నారని, త్వరలోనే మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నారని యూనిట్ తెలిపింది. ఈ వార్తతో అభిమానులు తొలుత ఆందోళన చెందగా, గాయాలు చిన్నవేనని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. 'ఫౌజీ' చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో సీతారామంతో ప్రశంసలు అందుకున్న ఆయన, ఈసారి మరింత ఎమోషన్‌తో కూడిన యాక్షన్ డ్రామాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ సినిమాలో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. దేశభక్తి, ప్రేమ, త్యాగం వంటి అంశాలతో కథ నడుస్తుందని తెలుస్తోంది. గుర్రపు స్వారీతో కూడిన హై వోల్టేజ్ చేజింగ్ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలవనుందని, భారీ సెట్స్ మరియు విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నారని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తోంది.

# మార్చిలో రానున్న ఉస్తాద్ భగత్ సింగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ మాస్ ఎంటర్‌టైనర్ ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో రాశి ఖన్నా, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తుండగా, మాస్ కమర్షియల్ చిత్రాలకు కేరాఫ్ గా ఉన్న ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. సంగీత బాధ్యతలను రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ చేపట్టారు. మార్చి 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. ఇటీవల విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' లిరికల్ వీడియో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ పాటకు భారీ స్పందన లభించగా, అనేక మంది అభిమానులు వాట్సాప్ స్టేటస్‌లుగా కూడా పెట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు దేవిశ్రీప్రసాద్ అందించిన ఎనర్జిటిక్ బీట్‌లు జత కావడంతో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. మొదటి పాట సూపర్ హిట్ కావడంతో సినిమా మీద




హైప్ మరింత పెరిగింది. ఇప్పటికే మొదటి సాంగ్ సక్సెస్ కావడంతో రెండో పాట కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో చిత్రబృందం 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో సాంగ్‌ను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన పోస్టర్ ప్రత్యేక డిజైన్‌తో ఉండి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ లుక్, మాస్ అటిట్యూడ్ పోస్టర్‌లో హైలైట్ కావడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత రెట్టింపైంది. గతంలో పవన్ కళ్యాణ్ ? హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన గబ్బర్ సింగ్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి పవన్ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించింది. అదే కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా మాస్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా కనిపిస్తోంది.




# ప్రమోషన్స్ పూర్తి చేసుకున్నాక టైటిల్ వివాదాలు

సినిమా ప్రమోషన్లన్నీ పూర్తి చేసుకున్నాక, సరిగ్గా సెన్సార్ సర్టిఫికేట్ వచ్చే సమయంలో టైటిల్ మార్చాల్సి రావడం నిర్మాతలకు పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా యంగ్ హీరో సుహాస్ నటించిన సినిమా కూడా ఇదే సమస్యను ఎదుర్కొంది. కేవలం సుహాస్ మాత్రమే కాదు, ఈ మధ్య కాలంలో మరికొన్ని చిన్న సినిమాలు కూడా సెన్సార్ అ÷–జబెక్షన్స్ వల్ల పేర్లు మార్చుకున్నాయి. సుహాస్, శివానీ నగరం జంటగా నటించిన చిత్రం 'హే భగవాన్'. ఈ నెల 20న విడుదలకు సిద్ధమైన ఈ సినిమాపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. దేవుడి పేరుతో ఉన్న టైటిల్ వల్ల కొన్ని వర్గాల సెంటిమెంట్స్ దెబ్బతినే అవకాశం ఉందని భావించిన బోర్డు, పేరు మార్చాలని సూచించింది. దీంతో మేకర్స్ చేసేదేమీ లేక చివరి నిమిషంలో టైటిల్‌ను 'హే బలవంత్!' గా మార్చారు. ప్రమోషన్లన్నీ పాత పేరుతోనే జరగడంతో ఈ మార్పు సినిమాపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని చిత్ర యూనిట్




ఆందోళన చెందుతోంది. ఇటీవల విడుదలైన 'వానర' చిత్రానికి కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ చిత్రంలో కుల రాజకీయాలు మరియు సున్నితమైన అంశాలు ఉండటం, టైటిల్ ఏమో హనుమంతుడిని గుర్తు చేసేలా ఉండటంతో సెన్సార్ బోర్డు నో చెప్పింది. దీంతో ఈ సినిమాను 'వనవీర' పేరుతో విడుదల చేయాల్సి వచ్చింది. ప్రమోషన్ల కోసం ఖర్చు పెట్టిన డబ్బు, టైటిల్ రీచ్ అంతా వృథా అయిందని ఆ చిత్ర దర్శకుడు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే శివ కందుకూరి నటించిన 'చాయ్ వాలా' సినిమాకు కూడా సెన్సార్ కష్టాలు తప్పలేదు. ఈ టైటిల్ వాడకూడదని బోర్డు పట్టుబట్టడంతో, చిత్ర యూనిట్ తమ వర్కింగ్ టైటిల్ అయిన 'నవాబ్ కేఫ్'ను ఖరారు చేసింది. తండ్రీ కొడుకుల మధ్య సాగే ఈ ఎమోషనల్ డ్రామా ఫిబ్రవరి 20న కొత్త పేరుతో థియేటర్లలోకి రానుంది. చిన్న సినిమాలకు టైటిల్ అనేది బ్రాండింగ్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. ఇలాంటి సమయంలో సెన్సార్ బోర్డు నిబంధనలు చిన్న నిర్మాతలకు భారంగా మారుతున్నాయి.




Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**